J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 30 26.12.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

● ప్రక్షాళనా.. ప్రతీకారమా?

# దేశవ్యాప్తంగా 'సర్' ప్రకంపనలు




- సర్వే పేరుతో పెద్దఎత్తున ఓట్ల తొలగింపు
- ఎన్నికల కమిషన్ తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- బీజేపీతో కలసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపణ
- అనర్హులను తొలగిస్తే ఏడుపెందుకని విపక్షాలకు కేంద్రం ప్రశ్న

***ఎన్నికల సమయంలో అధికార ప్రతిపక్షాలు ఒకరినొకరు టార్గెట్ చేసుకోవడం సర్వసాధారణం. అయితే, ప్రస్తుతం ఎన్నికల కంటే ముందే జరుగుతున్న ఓ తంతు సమరానికి సాక్షమవుతోంది. అదే ఓటర్ల జాబితా. దీని రూపకల్పనలో ఎన్నికల కమిషన్ (ఈసీ) తాజాగా పాటిస్తున్న విధానమే సర్ (SIR).***

ప్రత్యేక విస్తృత సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో చేపడుతున్న ఈ ప్రక్రియ ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓటరు జాబితాలో ఉన్న అర్హులను తొలగించి అడ్డదారిలో అధికారం చేజిక్కించుకోవడం కోసం బీజేపీ సంధించిన అస్త్రమే సర్ అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే అధికార దాహంతో పాక్, బంగ్లా, బర్మా, శ్రీలంక జాతీయులను భారతీయ పౌరులుగా చూపించి కొన్ని పార్టీలు పబ్బం గడుపుకోవాలనుకుంటున్నాయని, అలాంటి వాటికి చెక్ చెప్పడమే సర్ ఉద్దేశమని బీజేపీ కుండ

2లో




# గ'ఘన' విజయం



## బాహుబలీ.. భళా భళీ..!

ఎల్‌వీఎం-3 ఎం-6 సూపర్ సక్సెస్

12లో




# దేశవ్యాప్తంగా 'సర్' ప్రకంపనలు

(మొదటిపేజీ తరువాయి)

బద్దలు కొడుతోంది. నిజానికి ఈ ప్రక్రియ మంచిదే అయినా, అది చేపట్టే విధానమే సహేతుకంగా లేదన్నది తటస్థుల వాదన. ఎవరెన్నన్నా అసలు, నకిలీలను తేల్చే వడపోతే సర్ సమగ్ర రూపం అన్నది ఎన్నికల కమిషన్ మాట. అయితే, ఇది వ్యవస్థను మార్చేందుకు చేపట్టిన ప్రక్షాళనా..? లేక.. అస్మదీయులకు అనుకూలంగా విపక్ష పార్టీలపై ప్రతీకారమా? అన్నదే అసలు ప్రశ్న.

పార్టీల మధ్య విద్వేషాలు, కూటముల మధ్య విభేదాలు, నాయకుల మధ్య ప్రతీకారేచ్ఛ, ఇలా దేశంలో ఎన్నికల సమరం కురుక్షేత్ర యుద్ధాన్ని తలపిస్తోంది. ఇలాంటి సమయంలో అసలు ఓటర్లు ఎవరు, నకిలీ ఓటర్లెవరనే విషయంపై తీవ్ర సందిగ్ధత నెలకొంది. ఈ అంశాన్ని తేల్చేందుకే అన్నట్లు ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా ఓటర్ రివిజన్ పేరుతో ఎస్ఐఆర్ (సర్)ను అమలు చేస్తోంది. అయితే తమ అనుకూల వర్గాల ఓట్లను పెంచుకుని, వ్యతిరేక వర్గాల ఓట్లను తొలగించేందుకే ఎన్నికల కమిషన్ ద్వారా బీజేపీ సర్ నాటకానికి తెరతీసిందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. అయితే, కాంగ్రెస్ సహా కొన్ని ప్రాంతీయ పార్టీలు విదేశీయుల ఓట్లతో గద్దెనెక్కేందుకు కుతంత్రాలు పన్నుతున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. అందుకే ఓటర్ల జాబితాలో ప్రక్షాళన కోసం చేస్తున్న సర్వేలను అడ్డుకుని, జిమ్మిక్కులకి పాల్పడుతున్నాయని విమర్శిస్తున్నారు. కానీ విపక్షాలు అధికారంలో ఉండే రాష్ట్రాల్లోనే సర్వేలు చేపడుతూ ఈసీ ఓటర్లను తొలగిస్తోందని, తద్వారా బీజేపీకి భారీగా లబ్ధి చేకూర్చుతోందని విపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. ఎన్నికల కమిషనర్లు కూడా మోదీ-షా కనుసన్నల్లో మెదులుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నాయి.

## అసలేంటీ సర్..?

మేం వస్తే ఈ సంక్షేమ పథకాలు అందిస్తాం, ఫలానా అభివృద్ధి పనులు చేస్తాం, అనే రోజులు పోయాయి. ఈసారి మేమొస్తే, మీ అంతు తేలుస్తాం, రపా రప్పా నరుకుతాం అనే రాజకీయాలు ప్రస్తుతం రాజ్యమేలుతున్నాయి. ఇలాంటి సమయంలో అధికారం కోసం పార్టీలు, వాటి అధినేతలు ఎంతకైనా తెగిస్తున్నారు. ఎంతవరకైనా వెళ్తున్నారనడంలో సైతం సందేహం లేదు. ఈ నేపథ్యంలో అనుకున్నది సాధించాలంటే ఉండాల్సిన ఏకైక ఆయుధం అధికారం. దీనికి తొలిమెట్టే ఓటర్ల జాబితా. ఈ విషయాన్ని గుర్తించి అన్ని పార్టీలు తమ అనుకూల వర్గాల ఓట్లను జాబితాలో చేర్చడమే కాకుండా, వ్యతిరేక వర్గాల ఓట్లను గల్లంతు చేసేందుకు కూడా మాయోపాయాలు పన్నుతున్నాయి. ఈ కోవలోనే భారతీయ జనతాపార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను బూచిగా చూపి కొన్ని మతాలకు సంబంధించిన వారి ఓట్లను తొలగిస్తోందని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ఇందుకోసమే సర్ (ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ)ను అమలు చేస్తోందని ఆరోపిస్తున్నాయి.

## 'సర్' నిబంధనల్లో ఏముంది..?

సర్ పేరుతో చేపడుతున్న సర్వేలో, ఎన్నికల కమిషన్ కొన్ని నిబంధలను పొందుపరిచింది. అందులో ప్రధానంగా 2002, 2025 సంవత్సరాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ప్రాతిపదికగా తీసుకొంటోంది. వీటినే మ్యాపింగ్ అంటున్నారు. రెండింటిలోనూ పేర్లున్న వారిని మొదటి కేటగిరీలో చేరుస్తోంది. అలాంటి వాటికి ఏ ఇబ్బంది లేదు. అయితే, 2002 ఓటరు జాబితాలో లేకుండా 1987కు ముందు పుట్టిన వారిని రెండో కేటగిరిగా, 2002 జాబితాలో లేకుండా 1987-2004 మధ్య పుట్టిన వారిని మూడో కేటగిరిగా, 2004 తర్వాత జన్మించిన వారిని నాలుగో కేటగిరిగా పరిగణిస్తున్నారు. ఇందులో భాగంగా మొదట 2002లో ఉన్న ఇంటి పెద్దలు 2025లో ఉన్నారా..? వారి పిల్లలు, మనవళ్ల పేర్లను బీఎల్ఓ (బూత్ లెవల్ ఆఫీసర్)లు చెక్ చేస్తున్నారు. అలా ఉన్న వారి కుటుంబాలను గ్రీన్ కేటగిరిలో చేరుస్తున్నారు.

అయితే, మిగిలిన వారి విషయంలోనే ఇబ్బందులొస్తున్నాయి. ఎందుకంటే నేటి గ్లోబలైజేషన్ కాలంలో స్థిర నివాసాలు తగ్గిపోయాయి. ఫలితంగా ఉద్యోగాలు, వ్యాపారాలు, కూలిపనులు, జీవనోపాధి, వలసలు, వివాహాలు తదితర కారణాలతో పలు కుటుంబాల వారు అనేక చిరునామాలు మారాల్సి వచ్చింది. వీరిపేర్లంతా రెండు మూడు జిల్లాల్లో, వివిధ ప్రాంతాల్లో, వివిధ జాబితాల్లో ఉన్నాయి. దీంతో వారంతా 2002 జాబితాను ప్రాతిపదికగా తీసుకుంటే తమ పేర్లు కొత్త ఓటరు జాబితాలో గల్లంతవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రెండు దశల్లో ముగిసిన సర్..

ఇక సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పన కోసం ఈసీ చేపడుతున్న 'సర్' సర్వే ప్రస్తుతం రెండు దశల్లో ముగిసింది. తొలి దశలో ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు బిహార్ రాష్ట్రంలో సర్‌ను అమలు చేశారు. అక్కడ వివిధ దశలలో 65లక్షల ఓట్లను తొలగించారు. అయితే ఇది ఓట్ చోరీలో భాగంగానే జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. అయితే దీన్ని బిహార్ ప్రజలు విశ్వసించలేదనే భావించాల్సి ఉంటుంది. దీనికి కారణం తాజా ఎన్నికల్లో బిహార్‌లో ఎన్డీయే ఘన విజయం సాధించడం, కాంగ్రెస్, ఆర్జేడీ నేతృత్వంలోని ఇండియా కూటమి చావుదెబ్బతినడమే.

ఇక రెండో దశలో 9 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ చేపట్టాలని ఈసీ నిర్ణయించింది. ఈ ఏడాది నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకు సర్వే చేపట్టింది. ఇందులో భాగంగా ప్రధాన రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్‌లో 2.95కోట్లు, తమిళనాడులో 97.37లక్షలు, గుజరాత్‌లో 73.73 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 58 లక్షలు, కేరళలో 24 లక్షలు, గోవాలో లక్ష ఓటన్లు తొలగించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇక తొలగించిన ఓటర్లలో మృతులు, రెండు ప్రాంతాల్లో ఓట్లు కలిగిన వారు, అక్రమంగా భారత్‌లో నివాసం ఉంటున్న విదేశీయులైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్ రొహ్యింగా ముస్లింలు, మాల్దీవులకు చెందిన వారు, ఆగ్నేయ ఆసియా దేశాల పౌరులు, వివరాలు సక్రమంగా అందించని స్థానికులు ఉన్నట్లు వెల్లడించింది. కాగా, మూడో దశకు సంబంధించి తెలంగాణలో సర్ చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈసీ) జ్ఞానేష్‌కుమార్ తాజాగా ప్రకటించారు. ఇక్కడ 930మందికి ఓ బీఎల్ఓ చొప్పున కేటాయించి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే, దేశవ్యాప్తంగా 1.80కోట్ల మంది సిబ్బంది ఎస్ఐఆర్ సర్వేలో భాగస్వాములైనట్లు స్పష్టం చేశారు.

## సర్‌పై విపక్షాల ఫైర్..

కాగా ఓట్ చోరీని వ్యవస్థీకృతం చేసేందుకే ఎన్నికల కమిషన్ సర్ చేపడుతోందని కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీల అధినేతలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా 2026లో ఎన్నికలు జరగనున్న కేరళ, తమిళనాడు, బెంగాల్, అస్సాంలో లబ్ధి పొందేందుకే బీజేపీ ఎన్నికల కమిషన్‌ను సాకుగా చూపి అడ్డగోలుగా ఓట్లను తొలగిస్తోందని విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ వేదిగా ఎస్ఐఆర్‌పై ధ్వజమెత్తారు. ఎన్నికల సంస్కరణల పేరుతో కేంద్రం గొప్పలు చెప్పుకుంటూ, దేశంలో ఎన్నికల వ్యవస్థను ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) చేతిలో పెడుతోందని విరుచుకుపడ్డారు. తద్వారా ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు ఈసీని మోదీ ఓ అస్త్రంగా వాడుకుంటున్నారని ఆరోపించారు.

ఇప్పటికే ఉత్తరప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓట్ చోరీ జరిగిందని మిగిలిన రాష్ట్రాల్లోనూ ఇదే విధానాన్ని అవలంభించాలని బీజేపీ ప్లాన్ చేస్తోందని వ్యాఖ్యానించారు. రెండో దశ్ ఎస్ఐఆర్ చేపట్టిన బెంగాల్, తమిళనాడు, కేరళలో ప్రస్తుతం బీజేపీ వ్యతిరేక ప్రభుత్వాలు ఉన్నాయని, వాటిని దెబ్బతీసేందుకే అక్కడ అర్హులను పెద్దఎత్తున ఓటరు జాబితాల్లో నుంచి తొలగిస్తున్నారని మండిపడ్డారు. 2026 ఫిబ్రవరి7 తేదీపైన పూర్తి జాబితా పేరుతో అక్కడ ఓటర్ లిస్టు లను విడుదల చేసి, వాటిపై కోర్టులకు వెళ్లే అవకాశం కూడా లేకుండా ఎన్నికల కమిషన్ ద్వారా ఆగమేఘాలపై ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వనున్నారని ఆరోపించారు.

ఇక డీఎంకే అధినేత స్టాలిన్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ, కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కూడా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్, మోదీ, అమిత్‌షా ద్వయంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. కేవలం ప్రాంతీయ పార్టీలను లేకుండా చేసేందుకు బీజేపీ సర్ పేరుతో ఎన్నికల వ్యవస్థను చెరపడుతోందని తేల్చి చెప్తున్నారు. అయితే, భారతదేశం భారతీయులకు మాత్రమే సొంతమని, ఓట్ల కోసం విదేశీయులకు దారాదత్తం చేయబోమని బీజేపీ అగ్రనాయకత్వం ఎదురుదాడి చేస్తోంది. దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్ అవసరమని ఖరాకండిగా చెప్తోంది. అదే సమయంలో ఈసీ కూడా తాము రాజకీయ పార్టీలకు అతీతమని కేవలం ప్రక్షాళన, పారదర్శకత కోసమే సర్ చేపట్టినట్లు స్పష్టం చేస్తున్నారు. కోర్టులు కూడా చిన్నచిన్న మార్పులతో సర్ అమలు చేయాలనే ఆదేశించాయి.

ఏదేమైనా సర్ పేరుతో ఈసీ చేస్తున్న సర్వేలు మాత్రం రాష్ట్రాల్లో ప్రస్తుతం ప్రకంపనలు సృష్టిస్తున్నాయని అందరూ అంగీకరించవలసిన నిజం.

---

## అజరామరం ఆయన కీర్తి.. ఆచంద్రతారార్కం ఆయన స్ఫూర్తి!

# మహోన్నత విద్యావేత్త 'స్వామిదాస్'



'స్వామిదాస్' అంటే ఒక నిబద్ధత గల విద్యాధికారి గుర్తుకొస్తారు. స్వామిదాస్ అంటే నెల్లూరు నగరంలో మొదటి ఆంగ్లమాధ్యమం పాఠశాలను నెలకొల్పిన గొప్ప విద్యావంతుడు గుర్తుకొస్తారు. స్వామిదాస్ అంటే పాఠశాలలను నిశితంగా పర్యవేక్షించి, అవి సక్రమమార్గంలో నడిచేటట్లు చేసి, వేలాదిమందికి విద్యాబుద్ధులు నేర్పిన మార్గదర్శకుడు గుర్తుకొస్తారు. కేవలం మాటలకే గాక చేతలకు ప్రతిరూపమై నెల్లూరుజిల్లా విద్యారంగానికి ఎనలేని సేవలందించిన స్వామిదాస్ నాటి తరానికే కాక భవిష్యత్ తరాలకి కూడా స్ఫూర్తి.

సూళ్లూరుపేట సమీప కుగ్రామం మన్నారుపోలూరులో బిగువు ఆశీర్వాదం, సౌభాగ్యమ్మ దంపతులకు 1914 నవంబర్ 23 న జన్మించిన ఆయన రేణిగుంట, సూళ్లూరుపేటల్లో ప్రాథమిక, ఉన్నత విద్యలను పూర్తిచేసి, గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. మద్రాసులో ఎల్.టి శిక్షణ తీసుకున్నారు.

ఆంగ్లం, తెలుగు భాషల్లో అపార ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఆ ప్రావీణ్యమే ఆయనకు షాపర్ మిషనరీలోను, కొడైకెనాల్‌లో తెలుగు బోధించే అవకాశాలను యిచ్చింది. మిలిటరీలో కూడా బోధనావకాశాలను లభించేటట్లు చేసింది. తర్వాత కాలంలో భీమవరంలో జూనియర్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. శ్రీకాకుళం, కనిగిరి, పల్లెపాడులలో అదే హోదాలో పనిచేశారు.

పల్లెపాడు 'డైట్'లో ఆయన పనిచేస్తున్నప్పుడు, ఆయన ఎంచుకున్న కొత్త తరహా బోధనా పద్ధతులు, పరిపాలనాపరమైన కొత్త పోకడలు గొప్ప ప్రభావాన్ని చూపాయి. విద్యార్థుల జీవితాలు ఎంతగానో మెరుగుపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన సేవలను ఎంతగానో మెచ్చి సత్కరించింది. చిత్తూరు పరిషత్ విద్యాశాఖాధికారిగా కొంతకాలంగా పనిచేసిన ఆయనను, నెల్లూరుజిల్లా విద్యాశాఖాధికారిగా 1962లో ప్రభుత్వం నియమించింది. నెల్లూరులో ఆయన 1969 వరకు పనిచేశారు. ఆ కాలంలో ఆయన నెల్లూరుజిల్లాలో విద్యాభివృద్ధికి అకుంఠిత దీక్షతో పనిచేశారు. అద్భుత విజయాలు సాధించారు. ప్రభుత్వం ఆయన్ను అనేక సత్కారాలతో గౌరవించింది. 1969లో ఆయన పదవీ విరమణ పొందారు.

ఆ తరువాత 1970 ప్రాంతంలో స్వామిదాస్ ఒక విషయం గమనించారు. ఇంగ్లీషు మీడియంలో చదవడానికి నెల్లూరునుంచి ఏటా వందల సంఖ్యలో విద్యార్థులు మద్రాసుకు వెళ్తున్నారు. ఇది స్వామిదాస్‌ని ఆలోచింపజేసింది. ఆచరణలోకి దింపింది. ఆయన నెల్లూరులో ఆంగ్ల మీడియం స్కూల్ ప్రారంభించడానికి నడుం కట్టారు. తన పేరే స్కూలు పేరుగా పెట్టి ఇద్దరు విద్యార్థులతో ప్రారంభం అయిన స్వామిదాస్ ఇంగ్లిష్ మీడియం స్కూలు ఆయన సంకల్పబలంతో దినదిన ప్రవర్ధమానమైంది. స్కూల్ అభివృద్ధిలో ఆయన సతీమణి లిల్లీ స్వామిదాస్ సహకారం వుంది. 'ప్రతి పురుషుడి వెనుక ఒక స్త్రీ ఉంటుంది' అనే నానుడి నిజం చేసింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా స్వామిదాస్ స్కూల్ ఎంతోమంది ఇంజనీర్లను, డాక్టర్లను, ఉన్నతాధికారులనూ సమాజానికి అందిస్తూనే వుంది. ఆదర్శపాఠశాలగా కొనసాగుతూ వుంది. అక్కడ చదివి, ఉన్న స్థానాలకెదిగిన ఎంతోమంది ఈరోజుకూ ఆ స్కూల్ విద్యార్థులమని గర్వంగా చెప్పుకుంటున్నారు.

క్రమశిక్షణకి ఆయన మారుపేరు. యూనిఫాం, పరిశుభ్రత, చెత్తకుండీల నిర్వహణ, సామాజిక సేవ, ప్రార్థనా నిర్వహణ, ప్రాంగణంలో ఆంగ్లంలోనే సంభాషణ ఆ స్కూలు ప్రాంగణంలో ఖచ్చితంగా పాటించే అంశాలు. ప్రతి ఏటా జరిగే వార్షికోత్సవం విద్యార్థుల్లోని కళాభినివేశాన్ని బహిర్గతం చేస్తూ వుంటుంది. ప్రతిభా వ్యుత్పత్తులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'ఎక్స్‌పరిమెంట్స్ ఇన్ ఎడ్యుకేషన్' స్వామిదాస్ శ్వాస, 'టెస్టెడ్ టెక్నిక్స్' అన్నది ఆయన ధ్యాస. వాటి మీదే ఆయన పుస్తకం రాసి, ప్రభుత్వం ప్రశంసలు, సత్కారం కూడా అందుకున్నారు. ఆయన పుస్తకాలను విపరీతంగా చదివేవారు. ఎప్పుడూ ఆయన చేతిలో పుస్తకం వుండేది. తన పిల్లలు, విద్యార్థులు పుస్తక పఠనం ఎల్లప్పుడూ చేయాలని, పుస్తకమే వారికి హస్తభూషణం అని ఆయన సూచించేవారు.

ఆయన ఒక ఉత్తమ విద్యాధికారే కాదు, అంతకుమించి బాధ్యతగల ఒక కుటుంబ పెద్ద. ఆయన తన కుటుంబాన్ని ఎంతగానో అభిమానించేవారు. ఆయనకు ఆరుగురు పిల్లలు. అందరూ ఆడపిల్లలే! వారందరినీ విద్యావంతులను చేసి, వివాహాలు చేశారు. వీరందరూ ఆయన గుర్తుగా పాఠశాలను నడుపుతూ దానిని ఆదర్శ పాఠశాలగా కొనసాగిస్తూ ఇప్పటికీ తండ్రి మార్గంలో నడుస్తున్నారు. ఆడపిల్లలను ఆయన ఎప్పుడూ తక్కువగా చూసేవారు కాదు. "If a man is educated, only one is educated, If a women is educated the entire family is educated" అని నమ్మేవారు. స్త్రీ విద్య ఆయన అభిమతం.

అన్ని కోణాల్లో ఆయన వ్యక్తిత్వం మహోన్నతమైంది. ఆయన ప్రారంభించిన పాఠశాల నేటికీ అభ్యుదయ పథంలో నడుస్తుండడమే ఆయన లక్ష్యసిద్ధిని, ఆశయ సాధనను తెలియజేస్తుంది. నెల్లూరుజిల్లా వాసులు ఎప్పటికీ మరచిపోలేని ఒక విద్యావేత్త స్వామిదాస్. అజరామరం ఆయన కీర్తి.. ఆచంద్రతారార్కం ఆయన స్ఫూర్తి!

**డిసెంబర్18న స్వామిదాస్ వర్ధంతి సందర్భంగా ఆ మేధోమూర్తిని సంస్మరించుకుంటూ..!**

# నెల్లూరును స్మార్ట్ సిటీ చేయాలన్నదే లక్ష్యం

## • మంత్రి నారాయణ



ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌తో కలిసి కాలువలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరును సుందరంగా తీర్చిదిద్ది స్మార్ట్‌సిటీగా చేయాలన్నదే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 24న ఆయన ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌తో కలసి నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. కాలువల ఆధునీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మూలాపేట బాలికోన్నత పాఠశాలలో ఆధునీకరణ పనులు పరిశీలించి.. మూలాపేట చమ్మండివారి తోట పార్కులో రూ. 15 లక్షలతో సిద్ధమౌతున్న వాలీబాల్ కోర్టును పరిశీలించారు. 39వ డివిజన్‌లో వాకర్స్ రోడ్ వద్ద ఉన్న వెంగన్న కాలువ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు.. 42వ డివిజన్ మన్సూర్‌నగర్‌లో గచ్చు కాలువ ఆధునీకరణ పనులకు భూమి పూజ చేశారు. 48వ డివిజన్‌లో ఘోషా సుపత్రి ఆధునీకరణ పనులను, 49వ డివిజన్‌లోని మోడల్ హైస్కూల్‌లో బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్ కోర్టుల పనులను, 52వ డివిజన్ పీఎంఆర్ హైస్కూల్‌లో వాలీబాల్, బ్యాట్మింటన్ కోర్టుల పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ముంపు ముప్పు రాకుండా రూ.50 కోట్లతో నెల్లూరులో 12 కాలువల ఆధునీకరణ పనులను చేపట్టామన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

సీఎం సహాయనిధి పేదలకు ఒక వరంలాంటిదని మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రినారాయణ ఇటీవల 29 మందికి 22,42,308 రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేశారు. నెల్లూరు నగర సిటీ నియోజకవర్గంలో ఏడాదిలో 292 మందికి 3 కోట్లా 2 లక్షల 12 వేల 700 రూపాయల చెక్కులు అందచేశామని ఆయన తెలిపారు.

# ఉపాధి కల్పనలే లక్ష్యంగా.. అదానీ కృష్ణపట్నం పోర్ట్



ఉద్యోగ నియామకపత్రాలను అందుకున్న విద్యార్థులను అభినందిస్తున్న పోర్టు సీఈఓ జగదీశ్ పటేల్

గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం అదానీ కృష్ణపట్నం పోర్ట్ కృషి చేస్తుందని పోర్టు సీఈఓ జగదీశ్ పటేల్ చెప్పారు. బుధవారం పోర్టులో అదాని స్కిల్‌సెంటర్ ద్వారా వివిధ కంపెనీలలో ఎంపికైన ఐదుగురు విద్యార్థులకి అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి ద్వారా గ్రామీణ యువత మరియు మహిళల సాధికారత మిషన్లో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (డిడిఇఒ) కోర్సు కింద శిక్షణ పొందిన విద్యార్థులు టాటా ఎలక్ట్రానిక్స్ గ్రూప్, అమర రాజా గ్రూప్-మంగళ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ల నుండి ఉద్యోగ నియామక పత్రాలను పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ఉద్యోగాలకు ఎంపికైన టి. చంద్రసేన, శ్రీకళ, ఐ.సంధ్య, జీవన్ ప్రదీప్, పి.తరుణ్‌లను సీఈఓ సత్కరించారు. సిఇఒ సతీమణి చాందిని పటేల్, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



# ఆత్మీయ అభినందనలు

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ, నెల్లూరు నగర మేయర్ (ఇన్‌ఛార్జ్) పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ డిసెంబర్ 24వ తేదీ బుధవారం ఉదయం మాగుంట లే అవుట్‌లోని 'లాయర్' పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి నివాసానికి విచ్చేశారు. వారిద్దరినీ ప్రభు ఆత్మీయంగా స్వాగతించి అభినందనలు తెలియజేశారు. భారతీయ సినిమా గాయకులు దివంగత ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసే విషయంపై ఈ సందర్భంగా వారు చర్చించారు.






లాయర్
డిసెంబర్ 26, 2025

# అంతరిక్షంలో మెరిసే జయపతాక.. 'ఇస్రో'

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మన భారత భూమిలో.. అందులోనూ మన తెలుగు రాష్ట్రాల్లో.. మరీ ముఖ్యంగా నెల్లూరుజిల్లా నుంచి ఇటీవలే వేరుపడి తిరుపతి జిల్లాకు మారిన సూళ్ళూరుపేటలోని సముద్రతీర ప్రాంతమైన శ్రీహరి కోట దీవి నుంచి భారతీయ శాస్త్రవేత్తలు అద్వితీయంగా రూపొందించి ప్రయోగిస్తున్న రాకెట్లు..నింగిలోకి దిగ్విజయంగా దూసుకుపోతుండడం ఓ అద్భుతం!..అంతరిక్ష రంగంలో భారత్ ఎన్నో చరిత్రాత్మక విజయాలు సాధిస్తుండడం అపూర్వం! ఇటు పుట్టినిల్లు నెల్లూరుజిల్లా-అటు మెట్టినిల్లు తిరుపతి జిల్లాలకే కాక, ఉభయ తెలుగు రాష్ట్రాలకి, మొత్తంగా మన దేశానికే ఇది గర్వకారణమైన విషయం. ఒకప్పట్లో అడుగులో అడుగువేస్తూ, సైకిళ్ళపై రాకెట్ విడిభాగాలను మోసుకెళ్ళిన అట్టడుగు స్థాయి నుంచిప్రారంభమైన అంతరిక్ష ప్రయోగాలు..ఇప్పుడు అంతరిక్షంలో భారత్ పేరును మోతమోగిస్తున్నాయంటే.. దాని వెనుక మన శాస్త్రవేత్తల పట్టుదల, కృషి ఏపాటిదో వేరే చెప్పనక్కర లేదు. ఇటీవలి కాలంలో శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి ఒకదాని తర్వాత మరకొటిగా సాగుతున్న రాకెట్ ప్రయోగాలు..అపూర్వ విజయాలు ప్రపంచదేశాలని సైతం ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నా యంటే అతిశయోక్తేమీ కాదు. వరుస రాకెట్ ప్రయోగాలను సైతం విజయవంతం చేసి..నేల నుంచి నింగిదాకా..నింగిలోని జాబిల్లిదాకా అంతరిక్షరంగంలో ఇస్రో ప్రస్థానం అద్వితీయం. ఇన్ని విజయాలు నిజంగానే.. ఇదంతా కలా.. నిజమా అని పిస్తుంది కూడా. అవును!..అది పచ్చి నిజం. ఒకప్పటి మన మహనీయ శాస్త్రవేత్త విక్రమ్‌సారాబాయ్ కన్న కలే..ఇప్పుడు అక్షరాలా మన కళ్ళముందు సాకారమవుతోంది. ఒకప్పట్లో నేలమీద కుక్కిమంచాల్లో పడుకుని ఆకాశంలోకి విస్మయంగా చూస్తూ నక్షత్రాలను లెక్కపెట్టుకుంటూ మురిసిపోయిన భారతీయులు..ఇప్పుడు అదే ఆకాశంలో భారత కీర్తిపతాకాన్ని రెపరెపలాడిస్తుండడం చూసి అగ్రరాజ్యాలే ఔరా..అంటూ ఆశ్చర్యపోతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదంతా ఇస్రో ప్రతిభ!..అందుకే ఇప్పుడు అంతరిక్ష రంగంలో ఇస్రో..ఒక జయపతాకగా మెరుస్తోంది!..భారత్ ప్రజ్ఞాపాటవాలని దశదిశలా చాటుతోంది. అంతటి ఘనత వహించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఐఎస్ఆర్ఓ) ఇస్రో..ప్రారంభంలో ఎన్ని కష్టాలు పడిందో చెప్పలేం. 1969లో ఇస్రో ఏర్పాటైనప్పటి నుంచి శ్రీహరికోట నేలమీంచి నింగిలోకి రాకెట్ ప్రయోగాలు చేసేందుకు సమాయత్తమైంది. సంకల్పం గొప్పదే కానీ, ఉన్న వనరులు మాత్రం స్వల్పమే. అయినా సరే..అన్ని సమస్య లనీ అధిగమిస్తూ రాకెట్‌ల తయారీకి ఉపక్రమించింది. 1975లో మొట్టమొదట ఆర్యభట ఉపగ్రహాన్ని తయారుచేసి, సోవియట్ యూనియన్ సాయంతో నింగిలోకి పంపింది. భారత్ సొంతంగా అంతరిక్ష ప్రయోగాలు చేయగలదని అప్పుడే ప్రపంచానికి తొలిసారి తెలిసింది. ఆ తర్వాత 1980లో స్వయంశక్తితో, స్వీయప్రతిభతో ఎస్ఎల్‌వి-3 రాకెట్ ద్వారా రోహిణి ఉపగ్రహాన్ని నింగిలోకి దిగ్విజయంగా పంపి అంతరిక్ష రంగంలో మన శాస్త్రవేత్తలు తొలి విజయం సాధిం చారు. ఇక అప్పటినుంచి రామబాణాల్లా మన రాకెట్లు ఒకదాని వెంట మరొకటిగా అంతరిక్షంలోకి దూసుకుపోయాయి. ఒకటా రెండా..ఇప్పటికి 104 రాకెట్ ప్రయోగాలు చేయడం, వాటిలో ఏ ఒకటో రెండో తప్ప మిగిలిన అన్ని ప్రయోగాల్లోనూ తిరుగులేని విజయం సాధించడం..ఇస్రో ఘనతను చాటేవే. 2014లో ఒకేసారి ఒకే రాకెట్..ఏకకాలంలో..ఏకంగా 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. అంతేకాదు, అందని జాబిల్లిని సైతం అందుకుని..చంద్రయాన్ ద్వారా చందమామ దక్షిణ ధృవంపై మొట్టమొదటిసారిగా ల్యాండర్‌ను దించి మరో పెద్ద సంచలనం సృష్టించింది. ఒకప్పట్లో భారత్‌ని చులకనగా చూసిన దేశాలకి ఇప్పుడు..'దటీజ్ భారత్' అనిపించేలా ఇస్రో తన మేధాశక్తితో ఆకాశాన్ని జయిస్తోంది. పీఎస్ఎల్‌వి, జీఎస్ ఎల్‌విల వంటి ఎన్నెన్నో రాకెట్లతో.. టన్నుల బరువులను భుజం మీద సునాయాసంగా మోసుకుపోయే భళాభళి రాకెట్లతో.. శ్రీహరికోటే ఒక బాహుబలి రాకెట్ల కోటగా ఫరిడవిల్లుతోంది. తాజాగా, ఈనెల 24న శాటిలైట్ కనెక్టివిటీని స్మార్ట్‌ఫోన్‌కి చేర్చడం, అందుకు ఎల్‌విఎం3 బ్లూబర్డ్ బ్లాక్-2 అనే బాహుబలి రాకెట్‌ని ప్రయోగించి దిగ్విజయం సాధించడం మన శాస్త్రవేత్తల అపార ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. ఏదేమైనా, రానున్న కాలంలో భారత్ తలపెట్టిన గగన్‌యాన్, సూర్యయాన్ తదితర బృహత్ ప్రయోగాలకు ఈ విజయాలే మార్గదర్శకమవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

జయహో ఇస్రో!.. జయ జయహో భారత్!

# ఇన్నాళ్ళకి వాజపేయికి సముచిత గౌరవం!

భారతదేశ ప్రతిష్టని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన అభివృద్ధి ప్రదాత, స్ఫూర్తిదాత దేశ మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజపేయికి కనీసం ఆయన శత జయంతి నాటికైనా సముచిత గౌరవం లభించడం ఆనందదా యకం. దేశాన్ని ప్రగతి బాటలో నడిపించి కోట్లాదిమంది భారతీయుల మన్ననలని అందుకున్న గొప్ప నేత వాజపేయి. మూడు పర్యాయాలు ప్రధానమంత్రి పదవి చేపట్టి దేశ పురోగతికి దశదిశ నిర్దేశించిన మేధావి అటల్ జీ. ముఖ్యంగా 1999 – 2004 మధ్యకాలంలో ఆయన తీసుకున్న వ్యూహా త్మక నిర్ణయాలతో దేశంలో విప్లవాత్మక మార్పులు సంతరించుకున్నాయి. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధికి ఆయన పెద్దపీట వేశారు. దేశంలో సంచలనాత్మ కంగా జరుగుతున్న జాతీయ రహదారుల విస్తరణకు బీజం నాటిన దార్శనికులు వాజపేయి. ఆయన కాలం చేసిన ఏడేళ్ళ తరువాత ఆయన శతజయంతి సంద ర్భంగా అటల్ – మోడీ సుపరిపాలన యాత్ర పేరుతో వాడవాడలా వాజపేయి గారి విగ్రహాలు పెట్టి స్ఫూర్తి నేతగా భావి తరాలకు ఆయనని పరిచయం చేయడం అభినందనీయం. ముఖ్యంగా ఆంధ్రాలో ఈ కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా చేపట్టి నిర్వహిస్తున్న రాష్ట్ర బీజేపీ నాయకులు ధన్యులు! – **యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# 'రెప్పవాలని రాత్రి' రచయితకి, సమీక్షకుడికి అభినందనలు!

మాడభూషి సంపత్‌కుమార్ విరచిత కవితా సంపుటి 'రెప్పవాలని రాత్రి'పై సమీక్షకులు గంగిశెట్టి శివకుమార్ మన 'లాయర్'లో చాలాచక్కని విశ్లేషణ చేశారు. ఈ సమీక్ష చదివినప్పుడు మాడభూషి కవిత్వంలో ప్రధానంగా మూడు అంశాలు కనిపిస్తున్నాయి. అవి ఆధునిక జీవన వైరుధ్యం, తాత్వికత మరియు సామాజిక స్పృహ. 'ధ్యానం' అనే కవితలో రచయిత 'తోటను కొట్టేసి కుండీలో మొక్కలు పెం చడం, చెరువును మూసేసి తొట్టెలో చేప లను పెంచడం' వంటి ప్రస్తావనలతో మన కృత్రిమ జీవనశైలిని చాలా వ్యంగ్యంగా, పదునుగా ఎత్తిచూపారు. 'సున్నా' అనే కవితలో "తెచ్చింది సున్నా / తీసుకెళ్లేది గుండు సున్నా" అంటూ జీవిత పరమా ర్థాన్ని చాలా సరళమైన పదాలలో వివరిం చడం గొప్ప విషయం. అలాగే భూమి కోసం పోరాటాలు చేసేవారికి 'నువ్వు' అనే కవిత ద్వారా ఒక మట్టి ముక్కపై పెత్తనం దేనికని ప్రశ్నించడం ఆలోచింపజేస్తుంది. సంపుటి పేరు 'రెప్పవాలని రాత్రి'కి తగ్గట్టు గానే, యుద్ధ బీభత్సాన్ని, అశాంతిని నిర సిస్తూ శాంతిని కోరుకునే మానవతావాదిగా మాడభూషి ఇక్కడ కనిపిస్తున్నారు. వాల్మీకి నుంచి శ్రీశ్రీ, గద్దర్ వరకు కవులు మారినా కవిత్వం అమరమని చెప్పడం, సాహి త్యంపై సంపత్‌కుమార్‌కి వున్న అపారమైన గౌరవానికి నిదర్శనం. డా. గంగిశెట్టి శివ కుమార్ ఈ కవితా సంపుటిలోని సారాం శాన్ని చాలా అర్థవంతంగా పరిచయం చేశారు. ఇలాంటి లోతైన అర్థం ఉన్న పుస్త కాలను పరిచయం చేసినందుకు వారికి ధన్యవాదాలు. జాషువా గారి పద్యంలో "తెలుగు సాహిత్య సుందరీదేహవల్లికి ఎరవుసొమ్ముల సొగసు రానీయక" అన్న భావన రచయిత కవిత్వంలో కూడా అదే విధంగా సహజంగా, ఆడంబరాలు లేని లోతైన తాత్వికతతో ఉన్నట్లు కనిపిస్తోంది. రచయితకి, సమీక్షకుడికీ ఇద్దరికీ నా అభినందనలు.

**డా. కొమ్మవరపు విల్సన్‌రావు, హైదరాబాద్.**




# పథకాలు ఘనం!... పనులు లేని జనం!

చేతిలో చిల్లిగవ్వ లేదు. తమ గ్రామంలో చేద్దామంటే పనులు లేవు. ఇక తామెలా బతకాలి, తమనే నమ్ముకున్న పిల్లాపాపలని, కుటుంబాలని ఎలా బతికించాలి...? ఈ ఆలోచనే ఆందోళనగా మారి పల్లెవాసులని వలసబాట పట్టిస్తోంది. బ్రతుకుతెరువు కోసం ఉన్న ఊరిని వదిలేస్తున్నారు. మరో ప్రత్యామ్నాయం కనిపించని పల్లెజనం పొట్ట చేతపట్టుకుని పట్టణాలు, నగరాలతో పాటు ఇతర రాష్ట్రాలకి సైతం తరలిపోతున్నారు. అయితే, ఆ తరహా వలసలు గత కొంతకాలంగా మన రాష్ట్రంలో ఎక్కువగా కనిపించడం గమనార్హం. ఆంధ్రాలో సచివాలయాల ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం నిర్వహించిన ఓ సర్వేలోఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. రాష్ట్రంలో కోటీ 71 లక్షల కుటుంబాలుంటే, గత ఆరేళ్ళలో అందులో 12 లక్షలా 59వేల కుటుంబాలు పొట్టచేత పట్టుకుని బతుకుజీవుడా అంటూ ఇతర రాష్ట్రాలకు వెళ్ళిపోయినట్లు ఆ సర్వేలో తేలింది.

## ఆడా మగా అన్న తేడాలేదు, చిన్న పెద్దా అన్న తారతమ్యం లేదు!

కాలూ చెయ్యి కదలలేనివారు, వయోవృద్ధులు తప్ప పల్లెల నుంచి దాదాపు అందరూ వెళ్ళిపోయారని, ఇరుగుపొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, తెలంగాణ లకు వలసపోయి, తమకు దొరికన కూలిపని చేసుకుంటూ బతుకులీడుస్తున్నారంటూ ఆ సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. జిల్లాలవారీగా పరిశీలించినా, వలసపోయిన వారి సంఖ్యలో విశాఖపట్నం జిల్లా నుంచి కనీసం లక్షా13వేల కుటుంబాలు వున్నాయి. వరి పంటకు పుట్టినిల్లయిన నెల్లూరుజిల్లా నుంచి కూడా దాదాపు 85వేల కుటుంబాలు రాష్ట్రాన్ని విడిచి వెళ్ళిపోయాయి. అదేవిధంగా కర్నూలు, కడప, తిరుపతి, పల్నాడు, ఎన్టీఆర్‌జిల్లా, గుంటూరు, కృష్ణా, కాకినాడ, అన్నమయ్యజిల్లా, అనంతపురంలలో ఒక్కో జిల్లా నుంచి కనీసం 50వేల కుటుంబాల వంతున వెళ్ళిపోయారని సర్వే నివేదక పేర్కొంది. వీరంతా ఏ సమాచారమూ లేకుండా అదృశ్యమైనట్లు సర్వే గుర్తించింది. దీన్నిబట్టి మన రాష్ట్రంలోని పల్లెప్రజల దుస్థితి ఎంత దయనీయంగా ఉందో తేటతెల్లమవుతోంది. ఇలా మన రాష్ట్రంలోని అనేక ఇతర జిల్లాలతో పాటు, ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి కూడా మహారాష్ట్ర, గుజరాత్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు పల్లెప్రజలు తరలి వెళ్లిపోయారని సర్వే లెక్కలు చెప్తున్నాయి. ఈ గణాంకాలు చుస్తే మన రాష్ట్రం ఇంత దయనీయమైన పరిస్థితులలో ఉందా అన్న ఆందోళన కలుగుతుంది.

## అభివృద్ధి శూన్యం - వ్యవస్థలన్నీ దైన్యం!

పేదల కోసం, కష్టజీవుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామంటూ ప్రభుత్వాలు డాంబికాలు పోతున్నాయి. కానీ, వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉంటున్నాయి. కష్టజీవులకు కల్పతరువులాంటి నిర్మాణరంగం కుదేలై పోయింది. వటవృక్షం వంటి వ్యవసాయం రంగం ఎప్పుడో కుప్పకూలిపోయింది. చివరికి తినడానికి పిడెకెడు మెతుకులు దొరక్క, ఊరొదిలిపెట్టి వెళ్ళే దుర్గతి పట్టింది. పంటలకు పుట్టినిల్లుగా, అన్నదాతలకి కొదవలేని రాష్ట్రంగా 'ఆంధ్ర అంటే అన్నపూర్ణ' అని పేరెన్నికగన్న ఆంధ్రప్రదేశ్‌లో గడచిన ఆరేళ్ళుగా ఇంత దౌర్భాగ్యకర పరిస్థితులున్నా, పట్టించుకునే నాధులే లేరు. గత ప్రభుత్వం పల్లెసీమల ప్రగతిని పట్టించుకోకపోవడం ఒక శాపం అయితే, కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా పల్లె ప్రాంతాలలోని వాస్తవ స్థితిగతులను లోతుగా అధ్యయనం చేయలేకపోవడం మరో లోపం.

తాము పుట్టిన నేలని, కన్నతల్లి లాంటి వూరుని వదిలి పల్లెవాసులు పట్నవాసాలకి తరలి పోతున్నారు. కనీస కూలి పనులు లేక, వలస పోతున్నారు. ఏళ్ళతరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా కరుణించే. వారే కరువైపోయారు. వ్యవసాయ రంగం, ఆక్వారంగం, నిర్మాణరంగం, పారిశ్రామికరంగం ఇలా అదీఇదీ అన్న తేడా లేకుండా వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయి. ఆయా రంగాలలో పనిచేసే జనం బ్రతుకుతెరువు కోసం పరాయిపంచన చేరుతుండడంతో, కన్నతల్లిలాంటి పల్లెభూమి కన్నీరుపెడుతోంది.

## కూటి కోసం, కూలి కోసం పట్టణంలో బ్రతుకుదామని!

రాష్ట్ర విభజన ఏ దుర్ముహూర్తాన జరిగిందో కానీ, అప్పటినుంచి ఆంధ్రకి అన్నీ శాపాలే. వ్యవస్థలన్నీ కుదేలైపోయాయి. ఆంధ్ర పేరు చెప్పుకుని నాయకులు రాజ్యా లేలుతున్నా, ప్రజలని మాత్రం అథోగతి పాలుచేశారు. రాష్ట్రంలో ప్రగతి మేడిపండు చందంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక, కొంతమేరకు అభివృద్ధి జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో నిజమైన నిరుపేద లబ్దిదారులకు ఆ పథకాలు సక్రమంగా చేరడంలేదు. ముఖ్యంగా దేశానికి పట్టుకొమ్మలైన పల్లెలనే నిర్లక్ష్యం చేస్తే, ఇక పురోగతి అథోగతే. పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్ళిన మన తెలుగువారు, అందులోనూ అమా యక పల్లెప్రజలు అక్కడి భాష రాక ఎన్నిరకాల ఇబ్బందులకి గురవుతున్నారో, ఎన్నిరకాల బాధలు పడుతున్నారో మాటల్లో చెప్పలేం. ఇకనైనా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి పెద్దమనసుతో వారిని ఆదుకోవాల్సి ఉంది. ఇప్పటికే లక్షల సంఖ్యలో ప్రజలు రాష్ట్రాన్ని వదిలేసి వలసలు పోయారు. ఇంకా పోతూనే ఉన్నారు. వలసపోయిన వారిని గుర్తించి, వారిని ఉన్న ఊళ్ళకు రప్పించి, వారికి బతుకుతెరువు కల్పించి ఆదుకోవడం ప్రభుత్వాలు, పాలకుల తక్షణ కర్తవ్యం. ఖాళీ అయిపోతున్న పల్లెలతో ఆంధ్ర ఇప్పటికే బోసిపోయింది. పనులు లేక ఎడారిగా మారిన ఆంధ్రాని సస్యశ్యామలం చేసే పథకాలను సత్వరం చేపట్టి, నిరుపేద కూలీలకు ఉపాధి కల్పించాల్సి ఉంది. కాయకష్టం చేసుకునే కష్టజీవులను కూడా వలసలు పోకుండా కాపాడుకోలేకపోతే, మనం గొప్పగా చెప్పుకునే పురోగతికి అర్ధమే లేదు. మహాకవి శ్రీశ్రీ రాసిన గీతం

"కూటి కోసం కూలి కోసం
పట్టణంలో బ్రతుకుదామని
తల్లి మాటలు చెవిని పెట్టక
బయలు దేరిన బాటసారికి
ఎంత కష్టం.. ఎంత కష్టం" అన్న మాటలకి సజీవ సాక్ష్యంగా నేటి పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదేమో..!

**- రాజశ్రీ**

# తాతని మించిన మనుమడు

## గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించాడు



తనయుడు జిష్ణు ఆర్యన్‌ని అభినందిస్తున్న షరణి

మంత్రి నారాయణ మనుమడంటే ఏమనుకున్నారు?.. తాతని మించిన మనుమడనిపించుకున్నాడు. మంత్రి నారాయణ అప్పట్లో పీజీ స్టాటిస్టిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తే, ఆయన మనుమడు గంటా జిష్ణు ఆర్యన్ 8 ఏళ్ల వయసులోనే గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించాడు. గంటా రవి తేజ, షరణి దంపతుల కుమారుడైన జిష్ణు ప్రతిభా పాటవాలు అమోఘం. గోల్డెన్ రేషియోగా పిలువబడే పై అనే సంఖ్యలో ఉన్న 216 దశాంశ స్థానాలను 60 సెకన్లలోనే చెప్పి గిన్నిస్ రికార్డుల్లో తన పేరును నమోదు చేసుకున్న ఘనతను సాధించాడు. నాలుగైదు దశాంశ స్థానాలను సరిగ్గా గుర్తుచేసుకోవడానికే అపారమైన జ్ఞాపకశక్తి ఉండాలి. అలాంటిది 216 దశాంశ స్థానాలను గుర్తుంచుకోవడం, అది కూడా కేవలం నిమిషం వ్యవధిలోనే చెప్పగలగడం దాదాపుగా అసాధ్యమనే చెప్పాలి. కానీ అంతటి అపూర్వమైన ఘనతను సాధించడం విశేషం. హైదరాబాద్‌లో ఇటీవల గిన్నిస్ బుక్ అధికారుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జిష్ణు తన సత్తా చాటుకున్నాడు. తమ మనుమడి విజయానికి మంత్రి నారాయణ, ఆయన కుటుంబ సభ్యులు ఆనందిస్తూ శుభాకాంక్షలు తెలియజేయగా, నారాయణ గ్రూప్ డైరెక్టర్ షరణి, తన తనయుడి ప్రతిభను చూసి ముగ్ధురాలయ్యారు.

# తిరుమల వైకుంఠ ద్వారదర్శనాల్లో సామాన్యులకే పెద్దపీట!

**- మంత్రి ఆనం**



సమావేశంలో టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, మంత్రులు సత్యప్రసాద్, ఆనం, అనిత

కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వారదర్శనాలకు సామాన్యభక్తులకే ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. వైకుంఠ ద్వారదర్శనాలు జరిగే ఆ పదిరోజుల్లో 182 గంటల దర్శన సమయంలో 164 గంటలు సామాన్యులకే కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సోమవారం వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై ప్రభుత్వం నియమించిన ముగ్గురు మంత్రుల ఉప సంఘం సమావేశం జరిగింది. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి ఆనం పాల్గొన్నారు. టీటీడీ అధికారులతో, జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈసారి తిరుమలలో ఏఐ టెక్నాలజీతో క్యూలైన్ల పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల్లో ఆమేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైకుంఠ ద్వారదర్శనాలకు పటిష్ట ఏర్పాట్లుంటాయన్నారు. తొలి మూడు రోజుల దర్శనాలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి 23.64లక్షల మంది ఈ-డిప్‌కు నమోదు చేసుకున్నారని, 1.89 లక్షలమంది సామాన్య భక్తులకు ఈ-డిప్ ద్వారా టోకెన్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. భక్తులు ఏరోజు, ఏ సమయానికి దర్శనానికి రావాలో సమాచారం అందజేస్తామన్నారు. టోకెన్ లేని భక్తులు జనవరి 2 నుండి 8వతేదీ వరకు సర్వదర్శన క్యూలైన్ ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలకు అవకాశం ఉంటుందన్నారు. స్వామివారి దర్శనాలకు విచ్చేసే భక్తులకు విరివిగా అన్నప్రసాదాలు, తాగునీరు, తదితర సదుపాయాలుంటాయన్నారు. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరిలో.. 'విపిఆర్ నేత్ర' సేవలు

**17 పంచాయతీల్లో 5006 మందికి కంటి పరీక్షలు**

**3009 మందికి ఉచితంగా కంటి అద్దాలు**



పేద ప్రజల కంటిచూపును మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న 'విపిఆర్ నేత్ర' కార్యక్రమం ప్రజలకు విశేష సేవలందిస్తోంది. నవంబర్ 3న ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా డిసెంబర్ 20వ తేదీ వరకు వరికుంటపాడు మండలంలో 5257 మందికి, ఉదయగిరి మండలంలో 5006 మందికి.. మొత్తంగా 10,263 మందికి కంటి పరీక్షలు తదితర వైద్యసేవలు పూర్తికావడం విశేషం. వరికుంటపాడులో 2845 మందికి, ఉదయగిరిలో 3009 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఎక్కడ ఎలాంటి ఆటంకాలు లేకుండా విపిఆర్ నేత్ర వైద్యసిబ్బంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహిస్తూ, వారి కంటిచూపును మెరుగు పరుస్తున్నారు.. స్థానిక నాయకుల నుంచి ప్రజల నుంచి కూడా ఈ కార్యక్రమానికి మంచి ఆదరణ లభిస్తోంది. వైద్యసిబ్బందితో కూడిన బస్సు గ్రామాల్లోకి రావడంతో అనేకమంది గ్రామస్తులు ఆ వాహనం వద్దకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ నెల 22 నుంచి సీతారామపురం మండలంలోని బసినేనిపల్లి పంచాయతీ పడమటరొంపి దొడ్డ, ఎస్ఆర్‌నగర్‌లో విపిఆర్ నేత్ర బస్సు అందరికీ అందుబాటులో ఉంటుందని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని విపిఆర్ నేత్ర వైద్యసిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

# జడ్పీలో ఉద్యోగోన్నతులు



నెల్లూరుజిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలోని 17 మందికి ఇటీవల జూనియర్ సహాయకుల ఉద్యోగాల నుంచి సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి లభించింది. జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చేతులమీదుగా వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యోగోన్నతి పొందిన ఉద్యోగస్తులు అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. జడ్పీ సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో జె.మోహన్‌రావు, కార్యాలయ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లెల్లో పుట్టడం..ఒక వరం!

**- డాక్టర్ సతీష్‌రెడ్డి**




కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సతీష్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి

గ్రామీణ ప్రాంతాలలో పుట్టడం ఒక వరమని, పల్లెటూరి నేపథ్యం ఉన్న వారికి పట్టుదల ఎక్కువ అనీ ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు.. మన నెల్లూరీయులైన డా. గుండ్రా సతీష్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన దుత్తలూరులో ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్రమౌళిరెడ్డికి చెందిన సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యార్థుల క్విజ్ పోటీలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి సీడ్స్ సంస్థ ప్రాంగణాన్ని సందర్శించి, అక్కడ అందిస్తున్న సాంకేతిక విద్యా శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. సీడ్స్ సంస్థ సామాజిక బాధ్యతతో ప్రజల అభ్యున్నతికి పనిచేస్తున్న విధానాన్ని ఆయన ప్రశంసించారు. దేశస్థాయిలో మంచి హోదాలో వున్న ఐఏఎస్ అధికారి చంద్రమౌళిరెడ్డి మాతృభూమి రుణం తీర్చుకోవాలని సొంత ఊర్లో స్వచ్ఛంధ సంస్థ ఏర్పాటు చేసి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం, క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు, దృష్టి లోపం వున్న వృద్ధులకు కంటి అద్దాలను అందచేశారు.




# నెల్లూరు కబుర్లు

## ప్రజల కోసమే..ప్రజాదర్బార్



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ

ప్రజల కష్టాలు తీర్చడం కోసమే ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రూపొందించిందని, ప్రజా సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కారం మార్గం చూపే విధంగా 'ప్రజాదర్బార్' ప్రజలకు ఎంతో సహాయ పడుతుం దని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరులోని 3, 10, 39, 48 డివిజన్లలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ నందన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, ప్రజా దర్బార్‌లో వచ్చిన 326 సమస్యల అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అడిషనల్ కమిషనర్‌గా..హిమబిందు

కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా ఉన్న హిమబిందు ఎన్ఎంసి వార్డు సచివాలయాలకు అడిషనల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆమేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి ఈనెల22న ఉత్తర్వులు వచ్చాయి. అదేవిధంగా, ఏసీపీగా ఉన్న రఘునాథ రావును ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

### చిన్నయసూరి బాలవ్యాకరణం..

## విద్యార్థులకు ఓ కరదీపిక!



పరవస్తు చిన్నయసూరి 218వ జయంతి సభలో ప్రసంగిస్తున్న వక్తలు

నెల్లూరులోని డీకేడబ్ల్యు కళాశాలలో ఇటీవల బాలవ్యాకరణం కర్త.. పరవస్తు చిన్నయసూరి 218వ జయంతి సందర్భంగా జాతీయసదస్సు నిర్వహించారు. చెన్నై తెలుగు అకాడమీ వారి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'చిన్నయసూరి నీతిచంద్రిక-బాలవ్యాకరణ లక్ష్య లక్షణ సమన్వయం' గ్రంథాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.గిరి అధ్యక్షత వహించిన ఈసభలో శతావధాని సూరం శ్రీనివాసులు మాట్లా డుతూ, తెలుగు పద్యం ఉన్నంతకాలం బాలవ్యాకరణం అవసరం ఉం టుందన్నారు. తెలుగు భాషపై పట్టు సాధించేందుకు చిన్నయసూరి రచిం చిన బాలవ్యాకరణం కరదీపిక వంటిదని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. విఎస్‌యు వైస్‌చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాస రావు, చెన్నపురి తెలుగు అకాడమీ మేనేజింగ్ ట్రస్టీ డా. తూమాటి సంజీవరావు, డా.వి హనుమంతయ్య, డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, గంగిశెట్టి లక్ష్మీనారాయణ, డా. ఎస్‌వి ఉమామహేశ్వరరావు, డా.ఉన్నం చెంచయ్య, మాచవోలు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు..పోలియో చుక్కలు



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్

నెల్లూరు నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఈనెల 21న జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ వై.ఓ.నందన్‌లు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా పోలియో వ్యాధి రాకుండా, 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో డ్రాప్స్ వేయిం చుకోవాలని చెప్పారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 21 ప్రాంతాల్లో పోలియో చుక్కల కేంద్రాలని ఏర్పాటు చేశామని, రోటరీ క్లబ్ వారి సహకారంతో కూడా పలు ప్రాంతాల్లో పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నామన్నారు.

## జగన్ జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న మహిళలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఈనెల21న నెల్లూరులో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు జరిగాయి. తొలుత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో 54 కేజీల భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి మాట్లాడుతూ, అందరూ జగనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, జగన్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయని అన్నారు. అనంతరం 280మంది రక్తదానం చేశారు. కార్యకర్తలు, నాయకులతో పాటు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి తనయుడు రాణాప్రమోద్‌రెడ్డి కూడా రక్తదానం చేశారు.

## అత్యవసర రోగికి.. ప్లేట్లెట్ల వితరణ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి, నెల్లూరుజిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మరియు రక్తనిధి కేంద్రం కో-ఆర్డినేటర్ బయ్యా ప్రసాద్ ఇటీవల అత్యవసరమైన ఓ రోగికి ప్లేట్లెట్లను దానం



ప్లేట్లెట్లను దానం చేస్తున్న బయ్యా ప్రసాద్

చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్‌చైర్మెన్ చమర్తి జనార్ధన్‌రాజుల సమక్షంలో ఈ వితరణ జరిగింది. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్, బ్లడ్ సెంటర్ మోటివేటర్లు మధుసూదనరావు, భాస్కర్‌రావు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమతత్వమే..క్రీస్తు సందేశం

- మంత్రి నారాయణ సతీమణి రమాదేవి



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి నారాయణ సతీమణి రమాదేవి

శాంతిమార్గం-ప్రేమతత్వం ఏసుక్రీస్తు మానవాళికి ప్రసాదించిన సందేశాలని, ప్రతిఒక్కరూ ప్రేమ నిండిన మనసుతో జీవించాలని మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి చెప్పారు. నెల్లూరులోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆమె ఇటీవల ప్రీ క్రిస్మస్ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రిస్మస్ అంటే మానవాళికి శాంతిని, కరుణను పంచిన ఏసుక్రీస్తు భూమి మీద అవతరించిన పవిత్రమైన రోజని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా పొదలకూరు చర్చి సిబ్బంది చేసిన 'పరివర్తన' నాటక ప్రదర్శన, సాంస్కృ తిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆ చిన్నారులందరినీ ఆమె అభినం దించి ఆశీర్వదించారు. అనంతరం, క్రైస్తవ మతపెద్దలు క్రిస్మస్ ప్రాముఖ్య తను వివరించి, ప్రత్యేకప్రార్థనలు చేశారు. కాండిల్స్ వెలుగులో కేక్ కట్ చేసిన రమాదేవి, అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. 2026 నూతన సంవత్సరపు క్రిస్టియన్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించి, క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు.

### డా. కిషోర్స్ రత్నం విద్యాసంస్థల్లో..

## ఆకట్టుకున్న 'రైతు దినోత్సవం'



జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల12న నెల్లూరు సరస్వతినగర్‌లోని డా. కిషోర్స్ రత్నం హైస్కూల్‌లో రైతుల జీవన విధానాన్ని తెలిపే పలు కార్యక్రమాలు నిర్వహించారు. పొలాల్లో శ్రమి స్తున్న రైతులను ప్రత్యక్షంగా కలుసుకుని వారితో మాట్లాడుతూ, పొలం దున్నడం, నాట్లు వేయడం, నీరు పోయడం, కుప్ప నూర్చడం వంటి పనుల ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్లు డా.కృష్ణకిసోర్, వాసంతి కిషోర్‌లు మాట్లాడుతూ తమ రెక్కల కష్టంతో అందరికీ ఆహారాన్ని పండిస్తూ, శ్రమైక జీవన విధానానికి నిలువెత్తు నిదర్శనాలైన రైతులు అన్నదాతలంటూ కొనియాడారు. ఆ తర్వాత, పలువురు రైతులను సంప్రదాయ పద్ధతులతో పండ్లు, వస్త్రాలతో, శాలువలతో విద్యార్థులు సన్మానించారు. అనంతరం, రైతుల వస్త్ర ధారణతో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో.. పల్స్‌పోలియో



రోటరీ సభ్యుల సమక్షంలో పోలియో డ్రాప్స్ వేస్తున్న సిబ్బంది

జాతీయం పోలియో దినోత్సవం సందర్భంగా ఈనెల 21న నెల్లూరులోని రోటరీ క్లబ్ వారు నగరంలోని పుత్తా ఎస్టేట్, ఆత్మకూరు బస్టాండ్, గాంధీబొమ్మ కూడలి, వీఆర్‌సీ సెంటర్, ముత్తుకూరు గేట్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్‌లలో పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటుచేసి, ఐయిదేళ్ల లోపు పిల్లలకు సుమారు వెయ్యిమందికి పోలియో చుక్కలు వేశారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ టి.ఉదయభాస్కర్‌రావు, కార్యదర్శి రవీంద్రనాథ్, సభ్యులు డి.భరత్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కె.ప్రతాప్ కుమార్‌రెడ్డి, కేవీ సుబ్రహ్మణ్యం, బి.నరేష్‌చంద్రారెడ్డి, కే.మధుసూదన్ రావు, విశ్వేశ్వరరావు, అఖిలేష్‌రెడ్డి, మల్లికార్జున్, రామ్‌ప్రసాద్, విజయ రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, కేవీ సుబ్బారెడ్డి, సత్యనారాయణ, సాధు నరసింహా రావు, రాఘవేంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.



## వినతిపూర్వక భేటీ!



అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఇటీవల మంత్రి నారా లోకేష్‌తో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సర్వేపల్లి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల మంజూరు చేయాల్సిందిగా వినతి పత్రం అందజేశారు. సోమిరెడ్డి అభ్యర్థనపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారు.

# గిరిజన బిడ్డలు బాగా చదువుకోవాలి

## — సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

గిరిజన బిడ్డలు బాగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల ఆయన పొదలకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ సిబ్బందికి సెల్‌ఫోన్లు అందచేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 379 మంది అంగన్‌వాడీ సిబ్బందికి రూ.53.06లక్షల విలువైన సెల్‌పోన్లు అందిస్తున్నామని, చిన్నారులు, మహిళలకు మెరుగైన సేవలందించడంతో పాటు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుచేసేందుకు ఇవి ఉపయోగపడతాయని చెప్పారు. గిరిజనుల పిల్లల్లో పోషకాహార లోపం స్పష్టంగా కనిపిస్తోంటుందని, అమాయకులైన గిరిజనులు నిరక్షరాస్యత వల్ల అన్ని విధాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్యవివాహాలు జరిగేది కూడా ఎక్కువగా గిరిజనుల్లోనే అని, ఈ విషయంలో ఎదురయ్యే కష్టనష్టాలపై వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా అంగన్ వాడీ సిబ్బందిదేనన్నారు.

## గౌరవపూర్వక కలయిక!



నెల్లూరుజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాని 'లాయర్' పత్రిక సంపాదకులు శివ ప్రభాత్ రెడ్డి, డిసెంబర్ 23వతేదీ మంగళవారం వారి కార్యాలయంలో గౌరవ పూర్వకంగా కలిశారు. జిల్లాకి వచ్చిన అతికొద్ది కాలంలోనే జిల్లా ప్రజల నుండి విశేష ప్రశంసలు అందుకుంటూ , ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి వద్ద కూడా కితాబు అందుకున్న కలెక్టర్‌ని ప్రభు అభినందించి శాలువాతో సత్కరించారు.

# సైన్స్ ఫెయిర్‌లు.. సృజనాత్మకతకు వేదికలు

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థులలోని సృజనాత్మకశక్తిని మెరుగుపరిచే వేదికలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. వాటిద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ద ృక్పథాన్ని పెంపొందించాలన్నారు. ఇటీవల ఇందుకూరుపేట మండలం పల్లిపాడు డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె ప్రఖ్యాత శాస్త్రవేత్త సివి రామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులంతా సర్ సి.వి. రామన్, జగదీష్ చంద్రబోస్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయంలో నీటి పొదుపు, కాలుష్య నివారణ, పునరుత్పాదక



విద్యార్థిని ప్రయోగా విశ్లేషణని ఆసక్తిగా వింటున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇంధనం తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల గురించి తెలుసుకొని ఆమె వారిని అభినందించారు. ఈ ప్రాజెక్టుల వెనుక విద్యార్థుల కృషితో పాటు, ఉపాధ్యాయుల శ్రమ ఎంతో ఉందంటూ వారికి ధన్యవాదాలు తెలియచేశారు.






## స్మృత్యంజలి



ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై 20 ఏళ్ళు గడుస్తాయి.

**మరపురాని మీ మధుర జ్ఞాపకాలతో...**

బావ - చెల్లెలు
**ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై**

మేనల్లుడు
**డా॥ సి.యం.కిషోర్**
**శ్రీమతి లీలాదేవి, చెన్నై**

మేనకోడలు
**శ్రీమతి హరిత**
**డా॥ కె.రామానందరెడ్డి, కాకినాడ**

మరియు **కుటుంబసభ్యులు**

**డా॥ సి.మధుసూదనరెడ్డి**

జననం: 04.11.1950 మరణం: 31.12.2005





# బీద రవిచంద్రకి అభినందనల వెల్లువ

తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బీద రవిచంద్రని టీడీపీ, జనసేన శ్రేణులు అభినందనలతో ముంచెత్తారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరు ఇన్‌ఛార్జ్ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, జనసేన నేత చిట్టమూరు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు బీద రవిచంద్రను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.





# గోపాలరెడ్డి సేవలు అమూల్యం




డా. ఐ.గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌బీకేఆర్ సిబ్బంది

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈనెల 20న డా. ఐ.గోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. ఎన్‌బీకేఆర్ సిబ్బంది ఆయన విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం మాజీ వైస్ చాన్సలర్‌గా, ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ స్థాపక ప్రిన్సిపాల్ మరియు డైరెక్టర్‌గా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ, గోపాలరెడ్డి అమోఘమైన నేతృత్వంలో ఎన్‌బీకేఆర్ విద్యారంగంలో అగ్రగణ్యమైన సంస్థగా రూపొందిందని కొనియాడారు. ఆయన సారథ్యంలో నేడు ఎంతోమంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత పదవుల్లో విజయవంతంగా విధులు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. కళాశాల సివిల్ విభాగాధిపతి డాక్టర్ పి.వి.సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డా. శ్రీహరిరెడ్డి, వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి, లైబ్రేరియన్ పి.రామిరెడ్డి, ఏఓ వేణుగోపాల్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ఆయన విగ్రహం వద్ద పూలమాలలు సమర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.

# ఉత్తమ పోలీసులకు 'డీజీపీ అవార్డులు'

విధి నిర్వహణ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న పోలీసులకు డీజీపీ కార్యాలయం ద్వారా డీజీపీ డిస్క్, కమెండేషన్ పేరుతో ప్రదానం చేసే ప్రతిష్టాత్మక అవార్డులు ఈసారి నెల్లూరుజిల్లాలోని 15 మంది పోలీసులు అందుకోనుండడం విశేషం. ఇద్దరు డీజీపీ సిల్వర్ డిస్క్‌కి, మరో 13మంది బ్రాంచ్ డిస్క్‌కి ఎంపికయ్యారు. నెల్లూరులోని సయ్యద్ వారీస్ అహ్మద్(సీసీఎస్ హెచ్‌సీ), తిరుపతి మహీధర్‌రెడ్డి(హెచ్‌సీ ఎస్‌బీ)లు డీజీపీ సిల్వర్ డిస్క్ అందుకోనున్నారు. బ్రాంజ్ డిస్క్‌కి ఘట్టమనేని శ్రీనివాసరావు(రూరల్ డీఎస్పీ), ఎన్.శ్రీనివాస్‌సింగ్(ఎస్ఐ,డీసీఆర్‌బి), షేక్ రియాజ్‌అహ్మద్ (ఏఎస్ఐ-చిన్నబజారు పీఎస్), ఆవుల వరప్రసాద్ (ఏఎస్ఐ-నార్త్ ట్రాఫిక్ పీఎస్), చెరుకూరు రమేష్ (హెచ్‌సీ డీఎస్‌బీ), బత్తుల చిరంజీవి(హెచ్‌సీ సోమశిల పీఎస్), కె.శ్రీనివాసులు (కానిస్టేబుల్-మహిళా పీఎస్), గుమ్మ వీరేంద్ర (కానిస్టేబుల్-అనంతసాగరం పీఎస్), షేక్ జుబేర్‌అహ్మద్ (కానిస్టేబుల్-డీఎస్‌బి), దామవరపు లీలా మోహన్(కానిస్టేబుల్-సైబర్‌క్రైమ్), బీ.మురళీ కృష్ణ(హెచ్‌సీ-టెక్నికల్ సర్వీస్) ఎంపికయ్యారు.

# ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో..ప్రాంగణ ఎంపికలు

ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళశాలలో ఇటీవల ప్రీమియర్ ఇంజనీర్స్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ(మేనకూరు) వారు బీటెక్ మూడవ సంవత్సరం, ఆఖరిసంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఈ ఎంపికలు జరిగాయి. మొత్తం 135 మంది విద్యార్థులు పాల్గొనగా, టెక్నికల్ మరియు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులకు 3లక్షల రూపాయల వంతున సాంవత్సరిక వేతనం ఉంటుందని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్. కిషాందర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్


# రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



రైతులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు రూరల్ మండల పరిధిలోని పోటుపాలెం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల 'రైతన్నల సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి ప్రతి రైతు ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడు అండగా ఉంటుందని, రైతుల వద్దకు నేరుగా వెళ్లి వారి యొక్క స్థితిగతులను తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పట్టాభి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శిశుమందిర్‌లో మ్యాథ్స్‌డే



గూడూరులోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 22న మ్యాథమెటిక్స్ డే నిర్వహించారు. విద్యార్థులు అనేక రకాల మ్యాథమెటిక్స్ యాక్టివిటీలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళీరెడ్డి, కార్యదర్శి డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్‌యాదవ్), కోశాధికారి రావూరు రవిచంద్ర పాల్గొని శ్రీనివాస రామానుజన్ యొక్క గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానాచార్యులు వి.రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి




మహిళకి హెల్మెట్‌ను అందిస్తున్న డీఎస్పీ గీతా కుమారి

ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ గీతా కుమారి సూచించారు. పట్టణంలోని ఆసుపత్రి రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన హెల్మెట్ దుకాణాన్ని డీఎస్పీ గీతాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెల్మెట్ ఉంటే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. పట్టణ సి.ఐ శేఖర్‌బాబు, ఎస్.ఐ మనోజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గూడూరు పట్టణంలోని పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

# జాతీయ స్థాయి టెన్నీస్ పోటీలు



టెన్నీస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు మండలం బూదనం సమీపంలోని ఎ-ఫైవ్ హోటల్‌లోని టెన్నిస్ కోర్టులో ఆలిండియా టెన్నీస్ అసోసియేషన్ అధ్వర్యంలో జాతీయ స్థాయిలో మహిళా క్రీడాకారిణిలకు టెన్నీస్ పోటీలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. ఎ-ఫైవ్ హోటల్ జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు అనువుగా ఉందని, హోటల్ అధినేత బద్రి గిరిని అభినందించారు. సుప్రభ, దాతలు డా. జనార్దన్‌రెడ్డి, డా. రోహిణి, కనుమూరు హరిచంద్రారెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు కోసం హోమాలు



హోమం నిర్వహిస్తున్న కోట సునీల్‌కుమార్

గూడూరుకు పాలకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ 15 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ గూడూరు టవర్‌క్లాక్ వద్ద సాయి సత్సంగ నిలయ విజయదుర్గ ఉపపీఠం ఆధ్వర్యంలో దీక్షా శిబిరం వద్ద కోట సునీల్‌కుమార్ వివిధ రకాల హోమాలు నిర్వహించారు. పాలకుల మనసు మారి గూడూరు జిల్లా ఏర్పాటు చేయాలని పూజలు చేశారు.

# బంద్ విజయవంతం



బోసిపోయిన గూడూరు వీధులు

గూడూరును జిల్లా కేంద్రం చేయాలి, లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలనే డిమాండ్‌తో గూడూరు పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో గత 16 రోజులుగా రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ బంద్ విజయవంతమైంది. పలువురు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి సంఘీభావం తెలియజేశారు. విద్యార్థి జేఏసీ సభ్యులు గూడూరును జిల్లా కేంద్రం చేయాలని నినాదాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. జ్యూవెలరీ, బార్ అసోసియేషన్ సభ్యులు బంద్‌కు మద్దతు తెలిపారు.




### ఉపాధి హామీ.. యథాతథంగా కొనసాగించాలంటూ

## నెల్లూరులో వామపక్షాల ఆందోళన

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగంచాలని, వికసిత్ భారత్ జీ రామ్‌జీ పేరుతో ఆ పథకం స్థానంలో తెస్తున్న కొత్త చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని కోరుతూ, నెల్లూరులో ఈనె 22న వామపక్ష పార్టీలు, రైతు సంఘాల నాయకత్వంలో ధర్నాందోళనలు మిన్నుముట్టాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, సీపీఎం నేత మూలం రమేష్ తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ, కొత్తచట్టాన్ని వ్యతిరేకించారు. ఆ పథకం పేరు మార్చడమే కాక, నిధులను కూడా కుదించేయాలనే ఆలోచనలు చేయడం మంచిది కాదన్నారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం వేలాదిమంది పేదలకు ఉపయోగపడుతోందని, దీని నిర్వహణ రాష్ట్రానికి భారమయ్యే విధానాలు వద్దనే వద్దని వారు కోరారు. పేదప్రజలకు, కాయకష్టం చేసి బతికే బడుగుజీవుల బతుకుతెరువుకు ఉపకరించే ఈ పథకాన్ని అస్తవ్యస్తం చేసే విధానాలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు ఎన్.రమణయ్య, మధు, సిరాజ్, షానవాజ్, సీనియర్ నాయకులు రామరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లీలామోహన్, ఉపాధ్యక్షులు కామేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జిలానీఖాన్, ప్రజానాట్యమండలి నాయకులు విజకుమార్, శీనయ్య, సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాసులు తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద..104 ఉద్యోగుల ధర్నా

పూర్తిస్థాయిలో వేతనాలిచ్చి తమ సమస్యలు తీర్చాలంటూ నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల 23న 104 వాహన ఉద్యోగులు ధర్నాందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ ఆందోళనలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విఆర్ ఫణికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాంబాబు తదితర నాయకులు మాట్లాడుతూ, భవ్య యాజమాన్యం తమ న్యాయమైన డిమాండ్లను పరిశీలించి తమ కష్టాలు తీర్చేలా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. 104 ఉద్యోగులకు తగ్గించిన జీతాలను యాజమాన్యం పూర్తిస్థాయిలో ఇచ్చే విధంగా చూడాలని కోరారు. గతంలో మాదిరిగానే ఉద్యోగులకు ఏడాదికి 15 రోజులు క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని, 104 వాహనాల్లో బఫర్ ఉద్యోగులను తీసుకోవాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఏడు నెలలు గడిచినా ఇప్పటివరకు ఉద్యోగులకు నియామక పత్రాలు కానీ, పే-స్లిప్‌లు కానీ, ఐడీ కార్డులు కానీ పూర్తిస్థాయిలో ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 104 వాహనాల్లో ప్రజలకు అవసరమైన మందులు కొరత లేకుండా ఏర్పాటుచేయాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లోని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

### ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఉండొద్దంటూ..

## సైదాపురం నాయకుల ఆందోళన

ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి ఆచరించాలని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడం సముచితం కాదని పలువురు నాయకులు కోరారు. సైదాపురాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ప్రజలు అనేక వ్యయప్రయాసలు పడాల్సివస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలను నెల్లూరుజిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ, సైదాపురంలో గత వారం రోజులుగా చేస్తున్న నిరసన దీక్షలు ఈనెల 23 నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ మూడు మండలాలను నెల్లూరుజిల్లాలోనే ఉంచాలని ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వాన్ని కోరుతుండడంతో, కూటమి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని భావిస్తున్నామని, ఆ నమ్మకంతోనే ప్రస్తుతానికి ఆందోళన విరమించుకుంటున్నామని ఉద్యమ జేఏసీ కన్వీనర్ డీపీ పోలయ్య చెప్పారు.

# బంగ్లాదేశ్‌లో మత విద్వేషం!

మనసులో మాట 77

బంగ్లాదేశ్‌లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు ఆ దేశ ప్రజాస్వామ్యానికే సవాలుగా మారాయి. షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయిన తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడటంలో పూర్తిగా విఫలమయింది. పాలనపై పూర్తిగా పట్టుకోల్పోయినట్లు తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ముఖ్యంగా హిందూ మైనారిటీలపై జరుగుతున్న మూక దాడులు అంతర్జాతీయ సమాజాన్ని కలవరపెడుతున్నాయి. ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో మొదలైన ఉద్యమం, ఇప్పుడు అరాచకానికి దారితీయడం ఆందోళనకరం. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం పతనం తర్వాత, మైనారిటీలకు రక్షణ కరువైంది. మైమన్సింగ్, ఖుల్నా, సిల్హెట్ వంటి ప్రాంతాల్లో హిందూ దేవాలయాల ధ్వంసం, ఆస్తుల లూటీ, ప్రాణనష్టం నిత్యకృత్యమయ్యాయి. హిందువులు బిక్కుబిక్కుమని కాలం గడిపే పరిస్థితి అక్కడుంది. ముఖ్యంగా మైమన్సింగ్‌లో దీపు చంద్రదాస్ అనే హిందూ యువకుడిని అకారణంగా హింసించి, చెట్టుకు వేలాడదీసి తగులబెట్టిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసింది. ఎటువంటి ఆధారాలు లేకున్నా కేవలం వదంతులతో అమాయక హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం వెనుక మతోన్మాద శక్తుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది.

### యువ నేతల హత్యలు - అంతర్గత కుట్రలు

బంగ్లాదేశ్‌లో కొత్తగా ఉద్భవించిన రాజకీయ శక్తుల మధ్య ఆధిపత్య పోరు ప్రాణహాని దాకా వెళ్లింది. ఇటీవల 'ఇంక్విలాబ్ మంచా' ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ హాదీ గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించడం పెద్దఎత్తున అల్లర్లకు దారితీసింది. ఆ మరణం తర్వాత ఖుల్నాలో 'నేషనల్ సిటిజన్ పార్టీ' నేత మోతాలెబ్ షికేదర్ పై కూడా కాల్పులు జరిగాయి. ఈ యువ నేతల సిద్ధాంతాలను పరిశీలిస్తే, వారు హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడినవారే అయినప్పటికీ, వారిలో తీవ్రమైన భారత వ్యతిరేక భావజాలం కనిపిస్తోంది. షరీఫ్ హాదీ వంటి నేతలు భారత రాయబార కార్యాలయాల ముట్టడికి పిలుపునివ్వడం, "భారత దురాక్రమణను అరికట్టండి" వంటి నినాదాలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టారు. భారత్‌ను బద్నాం చేసేందుకు, లేదా బంగ్లాదేశ్‌లో భారత్‌కు వ్యతిరేకంగా సెంటిమెంట్‌ను ధృవీకరించేందుకు ఎవరో కుట్ర పన్నుతున్నారనే అనుమానాలు ఈ నేతలపై దాడి, అనంతర పరిణామాలను చూస్తే స్పష్టమవుతోంది. నిందితులు భారత్‌కు పారిపోయారని అసత్య ప్రచారాలు చేస్తూ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెంచే ప్రయత్నం జరుగుతోంది.

బంగ్లాదేశ్‌లో "ఇండియా అవుట్" ప్రచారాన్ని బలంగా వినిపిస్తున్న శక్తులు, బంగ్లాదేశ్ ప్రజల్లో భారత్ పట్ల ద్వేషాన్ని, హిందూ వ్యతిరేక భావజాలాన్ని నూరిపోస్తున్నాయి. ఇది రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలను దెబ్బతీయడమే కాకుండా, దక్షిణాసియాలో అస్థిరతను సృష్టించే విదేశీ శక్తుల (ముఖ్యంగా పాకిస్థాన్ లేదా చైనా అనుకూల వర్గాల) కుట్రగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ఆర్థిక సలహాదారు సలాహుద్దీన్ అహ్మద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ కుట్రల కోణాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. "భారత్‌తో సంబంధాలు క్షీణించడం ఏ దేశానికీ మంచిది కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్థిక అవసరాల దృష్ట్యా భారత్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగించడం అనివార్యమని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బయటి వ్యక్తుల ప్రేరేపణతో భారత్‌పై ద్వేషాన్ని పెంచుకోవడం దేశ ఆర్థికవ్యవస్థకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నిత్యావసర వస్తువుల సరఫరా కోసం భారత్‌పై ఆధారపడి ఉన్న దేశంలో, ఇటువంటి అల్లర్లు దేశ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తాయని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. బాహ్యశక్తులు బంగ్లాదేశ్ సెంటిమెంట్‌ను భారత్‌కు వ్యతిరేకంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యలను బట్టి అర్థం చేసుకోవచ్చు.

### భారత్‌లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా భారత్‌లో వీహెచ్పీ, భజరంగ్‌దళ్ వంటి సంస్థలు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాయి. న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద నిరసనకారులు తమ నిరసనను తెలియజేస్తూ, మైనారిటీల రక్షణకు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. బంగ్లాదేశ్ నేతలు భారత ఈశాన్య రాష్ట్రాలను విడదీస్తామంటూ చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. "బంగ్లాదేశ్‌కు ఇప్పుడు మందులు పనిచేయవు, కేవలం సర్జరీ (శస్త్రచికిత్స) మాత్రమే అవసరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అంటే, దౌత్యపరమైన చర్చలవల్ల ఫలితం ఉండదని, ఆ దేశంలో ఉన్న భారత వ్యతిరేక మూలాలను తొలగించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం వచ్చిందని ఆయన వ్యాఖ్యల అర్థంగా తోస్తోంది.

### అంతర్జాతీయ సమాజం బాధ్యత

బంగ్లాదేశ్‌లో శాంతి నెలకొనకపోతే అది మొత్తం దక్షిణాసియా శాంతికి విఘాతం కలిగిస్తుంది. అక్కడి ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, మైనారిటీలకు భద్రత కల్పించాలి. భారత వ్యతిరేక కుట్రలను అణచివేయాలి. మతోన్మాద శక్తులకు స్వేఛనిస్తే, అక్కడ ప్రజాస్వామ్యం మరణించినట్లే. ఇస్లాం ఛాందస వాద పాకిస్థాన్ దౌర్జన్యాల నుంచి విముక్తి పొంది సాధించుకున్న బంగ్లాదేశ్ ఆ ఉనికిని పోగొట్టుకున్నట్లే. బంగ్లాదేశ్‌ను సాధించిన అమరుల ప్రాణత్యాగానికి అర్థం లేనట్లే. అంతర్జాతీయ సమాజం వేగిరంగా స్పందించి బాహ్యశక్తుల కుట్రను ఖండించాలి. భారత్ కూడా తన సరిహద్దు భద్రత విషయంలో మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో పాటు పొరుగు దేశంలో మైనారిటీల రక్షణ విషయంలో అంతర్జాతీయ వేదికలపై గట్టిగా గళం ఎత్తాల్సిన అవసరం ఉంది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

### 'ధరణి' సేవాసమితి ఆధ్వర్యంలో..

# మంచినీటి ప్లాంట్




ఆర్‌ఓ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న 'ధరణి' సేవాసమితి ప్రతినిధులు

వింజమూరుకు చెందిన 'ధరణి' సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల ఏఎస్‌పేట మండలం దూబగుంటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జేసెన్స్ ఇండస్ట్రీ-చెన్నై వారి ఆర్థిక సాయంతో మంచినీటి ప్లాంట్ ఏర్పాటుచేశారు. జిల్లాలో మెట్టప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో దాహార్తితో ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం అరబిందో ఫార్మా, ఎమ్మెన్నార్ ఫార్మా, జేసన్స్ ఇండస్ట్రీస్, టాగ్రోస్ ఫార్మా, నయారా ఎనర్జీ తదితర పారిశ్రామిక సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఆయా కంపెనీల నిధులతో ఇప్పటి వరకు సుమారు కోటి రూపాయలు వెచ్చించి 20 వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటుచేసినట్లు ధరణి సేవా సమితి మేనేజింగ్ ట్రస్టీ యల్లాల మంజుల తెలిపారు. ధరణి సేవాసమితి గౌరవ సలహాదారు, ఎస్వీయు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి మాట్లాడుతూ, గతంలో తమ సేవాసమితి వారు వింజమూరు, మాముదూరు, మహిమలూరు ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించేందుకు, దానికి ప్రత్యామ్నాయంగా పలు పారిశ్రామిక సంస్థల సాయంతో సుమారు 10 లక్షల రూపాయల విలువైన జనపనార బ్యాగ్‌లను ఇంటింటికీ పంపిణీచేశామన్నారు. ఈ కార్యక్రమంలో 'ధరణి' ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, లంకా పద్మావతమ్మ, బయ్యపురెడ్డి శివ, బి.గోపి తదితరులు సహకారం అందించినట్లు తెలిపారు.

## నదులను జాతీయ సంపదగా ప్రకటించాలి

### - బీజేపీ నాయకుడు మిడతల రమేష్ -



రాయలసీమ నెల్లూరు జిల్లాలలో కృష్ణాజలాల ప్రవాహానికి, తెలంగాణ పార్టీల నాయకులు చెప్తున్న అభ్యంతరాలు ప్రకృతి ధర్మానికి విరుద్ధం ఉన్నాయని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఒక ప్రకటనలో ఆక్షేపించారు. నదీ జలాల పంపిణీ విషయంలో రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలని కృష్ణా ట్రిబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్ వాదనలు సమంజసంగా ఉన్నాయని ఆయన అంటూ, నదీ జలాలను జాతీయ సంపదగా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రాల విభజన సమయంలో కృష్ణా జలాలు పెన్నా బేసిన్‌కు మళ్లించుకునేందుకు విభజన చట్టం ఆమోదించిందని ఆయన తెలిపారు. అసలే రాయలసీమ దుర్భిక్ష ప్రాంతమని, 1981 నాటికి ముందే శ్రీశైలం నుండి కృష్ణా జలాలు రాయలసీమలో ప్రవేశిస్తున్నాయని, మహారాష్ట్ర-కర్నాటక-ఆంధ్రప్రదేశ్ అంతరాష్ట్ర ఒప్పందాల ప్రకారం 1988లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించారని ఆయన గుర్తుచేశారు. పైతట్టు ప్రాంతాల నుండి నీరు క్రింది ప్రాంతాలకు ప్రవహించడం ప్రకృతి సహజ ధర్మమని, అయితే తెలంగాణలో ఓట్ల కోసం రాజకీయ పార్టీలు నీటి సహజ సిద్ధ ప్రకృతి ధర్మనికి విరుద్ధంగా పోరాటాలు చేయడం సముచితం కాదని ఆయన పేర్కొన్నారు.

## 28న..వేద విజ్ఞాన వేదిక సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా 168వ ప్రసంగంగా డిసెంబర్ 28 ఆదివారం నాడు 'విజయనగర వికటకవి తెనాలి రామకృష్ణకవి సాహిత్య సౌరభం' అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందని వేదిక అధ్యక్ష-కార్యదర్శులు జేకేరెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త డా. నరసింహారెడ్డి ఊరిమిండి (పాలకమండలి సభ్యుడు-శంకర నేత్రాలయ, యుఎస్‌ఏ (డాలస్, టెక్సాస్) వక్తగా పాల్గొంటారని, ఆరోజున చెన్నై-టీనగర్‌లోని కృష్ణాహాల్-ఆంధ్రాక్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని, సాహిత్యాభిమానులందరూ తరలి రావాలని వారు కోరారు.



# అత్తగారింటికొచ్చిన అల్లుడు!

దివంగత నాయకుడు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి - శ్రీమతి శ్రీలక్ష్మమ్మల చిన్నల్లుడు, మాజీ శాసనసభ్యుడు తాడిపర్తి మునిసిపల్ ఛైర్మన్ జే.సీ.ప్రభాకరరెడ్డి ఇటీవల నెల్లూరుకి వచ్చారు. తన బావమరిది నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లి అత్త శ్రీలక్ష్మమ్మని కలసి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రసన్న సోదరులు రాజేంద్ర, జగదీష్‌లతోపాటు కుమారుడు రజిత్‌కుమార్ ఇతర కుటుంబసభ్యులతో కొంచెంసేపు కాలక్షేపం చేసి వెళ్లిపోయారు. దాదాపు ఆరేళ్ళ తరువాత తమ ఇంటికి వచ్చిన అల్లుడిని చూసి శ్రీలక్ష్మమ్మతో పాటు ఇతర కుటుంబసభ్యులు కూడా మురిసిపోయారు.

# డా. కిషోర్స్ రత్నం స్కూల్స్ క్రీడా వార్షికోత్సవం



క్రీడా జ్యోతితో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు

నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థ క్రీడా వార్షికోత్సవాల్లో భాగంగా ఇటీవల రోషిణి రత్నం జెఇఇ, కే25 మెడికల్ ఒలంపియాడ్, ఎలైట్ ఒలంపియాడ్, రత్నం టెక్నో స్కూల్స్‌లో విద్యార్థులు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడోత్సవం నిర్వహించారు. తొలుత జాతీయపతాకాన్ని, అనంతరం క్రీడా పతాకాన్ని రత్నం విద్యా సంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు ఆవిష్కరించారు. విద్యార్థులు తమకు చెందిన హౌస్‌లకు అనుగుణంగా పలు రంగుల టీషర్ట్‌లను ధరించి, మార్చ్‌ఫాస్ట్ చేశారు. రామ్మూర్తినాయుడు క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డా. కిషోర్స్ రత్నం స్కూల్ యాజమాన్యం ప్రతిఏటా స్పోర్ట్స్‌మీట్ ద్వారా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. సరస్వతీ నగర్‌లోని విద్యాలయం ద్వారా విద్యార్థులకు వివిధ క్రీడల్లో తర్ఫీదునిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిఏటా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకి ఎంపికవుతున్నారన్నారు. ఆ తర్వాత, వివిధ క్రీడల్లో గెలుపొందినవారికి మెడల్స్‌ని, సర్టిఫికెట్లని ప్రదానం చేశారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడుతోపాటు ఏఓలు తుహీన, సునీల్, వాణి, ఖాశీం, మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, అశోక్, ప్రిన్సిపాల్స్ మణిమాల, శివకుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురమ్మల జాతరకు.. మొదటి చాటింపు

అల్లూరులోని శ్రీ పోలేరమ్మవారి జాతరకి ఈనెల 23న తొలిచాటింపు జరిగింది. శ్రీ గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకి ప్రీతిపాత్రమైన మంగళవారం రోజున.. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా ఈ చాటింపు జరిగింది. జనవరి 6వ తేదీన జాతర వైభవంగా జరుగుతుంది. లక్షలాదిమంది భక్తజనులు ఈ జాతరకు తరలివస్తుంటారు. తొలుత విష్ణువర్ధన్‌రెడ్డి గ్రామస్తులతో కలసి విఘ్నేశ్వరుని దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అల్లూరుపేటలో వెలసివున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్తులందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# ఈజిప్ట్‌కు భారీ లిక్విడ్ నైట్రోజన్ ట్యాంక్

● మరో మైలురాయిని అధిగమించిన శ్రీసిటీ-వీఆర్వీ పరిశ్రమ



ప్రపంచ ప్రసిద్ధి చెందిన పారిశ్రామిక వాడ.. శ్రీసిటీలోని క్రయోజెనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామి సంస్థ (యుఎస్‌ఏ) చార్ట్ ఇండస్ట్రీస్‌కి చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, అత్యాధునిక క్రయోజెనిక్ సాంకేతికతతో తయారైన భారీ లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఈజిప్ట్‌లోని ప్రముఖ సంస్థ ఎయిర్ లిక్విడ్‌కు ఎగుమతి చేయడం ద్వారా మరో ప్రధాన మైలురాయిని అధిగమించింది. 531 కిలోలీటర్ల సామర్థ్యం, 168 టన్నుల బరువు, సుమారు 39 మీటర్ల పొడవు, 5.45 మీటర్ల వ్యాసం కలిగిన ఈ ట్యాంక్ క్రయోజెనిక్ ఇంజినీరింగ్‌లో అత్యున్నత ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ భారీ నిర్మాణాన్ని చెన్నై పోర్ట్‌కు తరలించేందుకు ప్రత్యేక మల్టీ-యాక్సిల్ లాజిస్టిక్స్‌ను వినియోగించారు. ఈ ఎగుమతిని 'మేక్ ఇన్ ఇండియా' సాధించిన గొప్ప విజయమని ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు.

## తెలుగుభాషను పరిరక్షించుకుంటూ..

# జీవనభాగంగా మలచుకోవాలి

### స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్



శాసన నమూనా స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న దీపా వెంకట్

వైఎస్సార్ కడప జిల్లాలోని ఎర్రగుంట్ల మండలం కలమల్ల లోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో 5వ శతాబ్దం నాటి తొలి తెలుగు రాతి శాసనం గతంలో బయల్పడింది. 1904లో భారత పురావస్తు శాఖ ఈ శాసనాన్ని నమోదు చేసింది. కలమల్ల గ్రామంలో ఉన్న ఆ శాసనం కాలక్రమేణా దెబ్బతినడంతో, గత ఏడాది కడపలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆ శాసనానికి ప్రతిరూపాన్ని (రెప్లికా) రూపొందించాలని స్వర్ణభారత్ ట్రస్ట్‌కి సూచించడంతో ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ.. తన కుమార్తె దీపా వెంకట్ స్పందించి, శాసన ప్రతిరూపాన్ని తయారు చేయించారు. దానిని ఈనెల 21 కడపలోని జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో దీపా వెంకట్ ఆవిష్కరించారు కూడా. అలా.. స్వర్ణభారత్ ద్వారా.. అమ్మభాషకి అరుదైన గౌరవం దక్కినట్లయింది.

ఆ శాసనం నమూనాస్థూపం ఆవిష్కరణోత్సవంలో పాల్గొన్న దీపా వెంకట్ మాట్లాడుతూ, తెలుగుభాష కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదని, అది మన సంస్కృతికి, మన ఆలోచనా విధానానికి, మన ఆత్మగౌరవానికీ ప్రతీక అని తమ నాన్నగారు చెప్తుంటారని, మాతృభాషలో ఆలోచిస్తేనే మన ఆలోచనలు స్పష్టంగా వికసిస్తాయని ఆమె అన్నారు. నెల్లూరులో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పడడానికి తమ నాన్నగారు చేసిన కృషి అపారమని ఆమె గుర్తు చేసుకున్నారు.

### సి.పి.బ్రౌన్ సేవలు చిరస్మరణీయం

ఈ సందర్భంగా తెలుగు భాష అభివృద్ధికి సీపీ బ్రౌన్ చేసిన సేవలను ఆమె కొనియాడారు. బ్రౌన్ ఆంగ్లేయుడైనా, తెలుగు సాహిత్యంలోని విలువలను గమనించి, అది ఎప్పటికీ అజరామరంగా ఉండిపోవాలని వేలాది తాళపత్ర గ్రంథాలను సేకరించి, తన సొంత ధనాన్ని వెచ్చించి నిఘంటువులు, వ్యాకరణ గ్రంథాలు, కావ్యాల ముద్రణ చేపట్టడం ఎంతో గొప్ప విషయమన్నారు. తెలుగుభాషను ఒక పాఠ్యాంశంగానే కాక, జీవనభాగంగా మలచుకోవాలని, మన మాతృభాషను మనం ఎల్లవేళలా పరిరక్షించుకుంటూ ఉండాలని ఆమె ఈ సందర్భంగా అందరికీ సూచించారు. ఈ కార్యక్రమంలో జానమద్ది సాహితీపీఠం (కడప) మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ➤ కేర్ ఆసుపత్రి వైపు.. అంతర్జాతీయ రోగుల చూపు

### ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన ఇఎన్‌టీ నిపుణుడు

# డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డి



*హైదరాబాదు కేర్ ఆసుపత్రిలోని ఇఎన్‌టీ విభాగం అంతర్జాతీయ రోగులని ఆకర్షిస్తోంది. అందుకు ముఖ్యకారణం ప్రఖ్యాత ఇఎన్‌టీ నిపుణుడు మన నెల్లూరీయుడు డాక్టర్ నారపరెడ్డి విష్ణుస్వరూప్‌రెడ్డి ఇఎన్‌టీ విభాగానికి అధిపతిగా ఉండడమే. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో చికిత్స చేయించుకున్నా నయం కాని సమస్యకి పరిష్కారం డాక్టర్ విష్ణు చూపిస్తున్నారు. తన నైపుణ్యంతో వచ్చినవారికి చికిత్స చేసి వారి సమస్యని తీర్చి వారిని సంతృప్తిపరచి వారి దేశాలకి పంపిస్తున్నారు. తాజాగా జరిగిన రెండు సంఘటనలే అందుకు ఉదాహరణ.*

### శ్వాస సమస్యతో మొదటి రోగి...!

ఆస్ట్రేలియా దేశంలోని బ్రిస్బేన్‌కి చెందిన 35 సంవత్సరాల వ్యక్తి దీర్ఘకాలంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండేవాడు. తమ దేశంలో రెండుసార్లు శస్త్ర చికిత్సలు చేయించుకున్నప్పటికీ ఆ రోగి సమస్య తీరలేదు. ఈ క్రమంలో హైదరాబాదులోని కేర్ ఆసుపత్రి సేవల గురించి తెలుసుకుని ఆ రోగి డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డిని సంప్రదించాడు. రోగి ఇబ్బందిని క్షుణ్ణంగా పరిశీలించిన డాక్టర్ విష్ణు అతి క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా సదరు రోగికి వైద్యం అందించారు. శ్వాస తీసుకోవడంలో వున్న ఇబ్బందిని పరిష్కరించారు. డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డి చికిత్సతో పూర్తిగా సంతృప్తి చెందిన ఆ రోగి సంతోషంగా తమ దేశానికి తిరిగి వెళ్ళిపోయాడు. రోగి ఆసుపత్రి వర్గాలని సంప్రదించిన 48గంటల లోపే ఆయన లోపాన్ని గుర్తించడం, అవసరమైన వైద్యం అందించడం ఆ వెంటనే ఆయనని డిశ్చార్జ్ చేయడం జరిగిపోయాయి.

### వినికిడి సమస్యతో రెండవ రోగి..!

అమెరికా దేశంలోని న్యూయార్క్‌కి చెందిన మరో 30సంవత్సరాల యువకుడు వినికిడి సమస్యతో బాధపడుతుండేవాడు. ఆ యువకుడి రెండు చెవుల్లోనూ వినికిడి లోపం వుంది. అయితే, తమ దేశంలోని కాలిఫోర్నియాలో ఆ రోగి తన కుడి చెవికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. కానీ, ఫలితం లేకపోవడంతో కేర్ ఆసుపత్రిలోని డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డిని సంప్రదించారు. ఆ యువకుడి ఎడమ చెవికి డాక్టర్ విష్ణు శస్త్ర చికిత్స చేశారు. ఆపరేషన్ టేబుల్‌పైనే ఆ రోగికి స్పష్టంగా వినిపించేలా చేశారు. ఆ రోగిలోని ఉత్సాహాన్ని గమనించిన డాక్టర్ విష్ణు ఆ రోగి అనుమతితో ఆయనకి అంతక ముందు శస్త్ర చికిత్స జరిగిన కుడిచెవికి కూడా ఆపరేషన్ చేసి రెండు చెవులకీ పూర్తిస్థాయి వినికిడి తెప్పించారు. సంపూర్ణ ఆరోగ్యంతో పరిపూర్ణ వినికిడితో ఆ రోగి తిరిగి అమెరికాకి వెళ్ళిపోయాడు.

### భారతదేశంలోనే ఇది సాధ్యం - డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డి

ఈ రెండు కేసుల ప్రాముఖ్యతపై డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డి మాట్లాడుతూ తాను పదేళ్ళకుపైగా ఇంగ్లాండ్‌లో పని చేశానని, యూకే, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రియా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అత్యాధునిక శస్త్రచికిత్సలపై ప్రత్యేక శిక్షణ పొందానని అన్నారు. అయితే, భారతదేశంలో జనాభా ఎక్కువ వుండడం వల్ల, ఇక్కడ సర్జన్‌లకి విస్తృతమైన వైద్య అనుభవం ఉంటుందని చెప్పారు. ఇలాంటి అనుభవం అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం అరుదుగా ఉంటుందని అన్నారు. ప్రపంచ నలుమూలల నుండి వచ్చే అత్యంత క్లిష్టమైన కేసులను ఖచ్చితంగా స్థిరంగా నమ్మదగిన ఫలితాలతో విజయవంతంగా నిర్వహించగలిగే సమర్థత భారతీయ వైద్యులకే ఉంటుందని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా తన పేరు మారుమ్రోగేలా సేవలందిస్తున్న మన నెల్లూరీయుడు డాక్టర్ విష్ణుస్వరూప్‌కి 'లాయర్' శుభాకాంక్షలు.

## వెంకటాచలం సీహెచ్‌సీకి..
# అరుదైన గుర్తింపు




నెల్లూరుజిల్లా మండల కేంద్రమైన వెంకటాచలంలో ఉన్న సామాజిక ఆరోగ్యకేంద్రానికి అరుదైన గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో నాణ్యమైన సేవలందించే ఆరోగ్యకేంద్రాలకు ఇచ్చే 'క్వాలిటీ సర్టిఫికెట్' ఈసారి రాష్ట్రంలో రెండు కేంద్రాలకే వస్తే, అందులో ఒకటి మనజిల్లాలోని వెంకటాచలం సీహెచ్‌సీ ఉండడం విశేషం. నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ పరిశీలనలో ఎన్నికైన ఘనత ఈ కేంద్రానికి దక్కింది. సేవల్లో నాణ్యత, రోగుల పట్ల భద్రత, సంతృప్తికర వైద్యసేవలందించడం, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం తదితర విభాగాల్లో ఈ కేంద్రం రాణించి 84.29శాతం స్కోరు సాధించడంతో క్వాలిటీ సర్టిఫికేషన్ లభించనున్నట్లు ఆసుపత్రివర్గాలు తెలిపాయి. ఈ సర్టిఫికేషన్ సాధించినందుకు ఈ కేంద్రానికి ఇన్సెంటివ్‌గా రూ.3లక్షలు, మెయింటినెన్స్‌కి ఏడాదికి లక్ష రూపాయల వంతున అందించనున్నారు.

**సోమిరెడ్డి కృషి అపారం :**

వెంకటాచలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేందుకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేసిన కృషి అపారమని, ఆయన చొరవతోనే ఈ కేంద్రానికి మంచి గౌరవం లభిస్తోందని ఆసుపత్రి వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అందుకు పూర్తిసహకారాన్ని అందిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, కూటమి ప్రభుత్వం చేస్తున్న సహకారం ఎనలేనిదని వారు పేర్కొంటున్నారు.

## సేవే లక్ష్యంగా..
# మదన్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



తోపుడు బండ్లను పంపిణీ చేస్తున్న నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు నగరంలోని 18,19,20 డివిజన్ల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 21వ తేదీన పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. 19వ డివిజన్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 135 మంది రక్తదానం చేశారు. నిరుపేద వ్యాపారులైన 9 మందికి ఆయన తోపుడుబండ్లు పంపిణీ చేశారు. 48 మంది పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీచేసి, వారిని శాలువలతో సన్మానించారు. అనంతరం లంబోదర సెంటర్‌లో లంబోదర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చైతన్య ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు.

**ఉచిత వైద్య శిబిరం.. క్యాన్సర్‌పై అవగాహన సదస్సు :**

మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మాగుంట లేఅవుట్‌లోని ఎంఆర్ బిల్డింగ్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం మరియు క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. మదన్ కుమార్‌రెడ్డి సహాయసహకారాలతో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరంలో మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్య నిపుణులు మేకల వెంకటసుధాకర్, ఏ.ఎం.జయరామ్, పి.విజయ కుమార్, ఎం.రమేష్‌బాబు తదితరులు పాల్గొని రోగులకు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు చేసి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. డా.ఎం.రమేష్‌బాబు మాట్లాడుతూ, జీవనశైలి మార్పులతో సమస్యలు వస్తున్నాయని, పొగాకు వినియోగం మానుకోవాలని, సకాలంలో స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని, లేదా తొలిదశలోనే గుర్తించి విజయవంతంగా చికిత్స చేయవచ్చని వివరించారు.

## ఏపీ హైకోర్టు కేంద్రప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌గా
# మరోసారి పెల్లేటి రాజేష్‌కుమార్



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సెంట్రల్ గవర్నమెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పెల్లేటి రాజేష్ కుమార్‌ను నియమిస్తూ కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. రాజేష్ కుమార్ ఇప్పటికే రాష్ట్ర హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే, రాజేష్ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనని మరోసారి కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించింది. రాజేష్‌కుమార్ కేంద్ర సంస్థలకు సంబంధించిన కేసులను విజయవంతంగా వాదించి అనుకూలమైన తీర్పులను సాధించారు. అంతేకాకుండా ఆయన ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ జెఈఈ అడ్వాన్స్‌లకి(జొసా) జాయింట్ సీట్ ఆలోకేషన్ అథారిటీలకు కూడా స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్నారు. సీనియర్ న్యాయవాది, కోట వాస్తవ్యులు పెల్లేటి గోపాల్‌రెడ్డి కుమారుడే రాజేష్‌కుమార్ పెల్లేటి. చిన్న వయస్సులో ఉన్నత స్థానాలలో రాణిస్తున్న రాజేష్ ప్రస్థానం పట్ల సహచర న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 'చెట్టు=తల్లి'కి..2 అవార్డులు

### ద్వితీయ ఉత్తమ షార్ట్‌ఫిల్మ్‌గా ఎంపిక
### ఉత్తమ రచయితగా కళాంజలి అనంత్



నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత-నటుడు-దర్శకుడు 'కళాంజలి' అనంత్ సారథ్యంలో ఇటీవల రూపొందించిన 'చెట్టు=తల్లి' షార్ట్‌ఫిల్మ్‌కి 2 అవార్డులు లభించాయి. తెలంగాణలోని మంచిర్యాలలో జరిగిన 'బాపూ-రమణ స్మారక అవార్డు'ల పోటీలో ఈ షార్ట్‌ఫిల్మ్ ఏకంగా రెండు అవార్డులను సాధించడం విశేషం. రవికిరణ్ ఆర్ట్స్-మంచిర్యాల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకి ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 39 షార్ట్‌ఫిల్మ్‌లు రాగా, 'చెట్టు=తల్లి'కి..'ద్వితీయ ఉత్తమ అవార్డు' లభించగా, ఈ చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం వహించిన 'కళాంజలి' అనంత్ 'ఉత్తమ రచయిత' అవార్డు సాధించారు. ఈనెల 25న ఈ పోటీల ఫలితాలు వెల్లడయ్యాయని, ఈనెల 28న బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని అనంత్ తెలిపారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ సేవలకి..
# ఉత్తమ అవార్డులు



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సేవలకి విశాఖపట్నంలో ఇటీవల జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్-34వ కన్వెన్షన్‌లో పలు అవార్డులు లభించాయి. గత ఏడాది ఈ అసోసియేషన్ వారు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాలు, సేవా కార్యక్రమాలు ప్రశంసలందుకున్నాయి. మండు వేసవిలో.. మేనెలలో 40 రోజులపాటు వాకర్స్‌కి, ఏసీ స్టేడియంకి నిత్యం పెద్దసంఖ్యలో వచ్చే క్రీడాకారులకి చల్లని మజ్జిగ పంపిణీ చేయడం వంటి సేవలు ఆ సదస్సులో ప్రస్తావనకి వచ్చాయి. దీంతో అసోసియేషన్ ప్రెసిడెంట్ కిలారి శ్రీనివాసులునాయుడుకి 'బెస్ట్ ప్రెసిడెంట్' అవార్డుతో పాటు నగదు బహుమతినిచ్చి గౌరవించారు. అదే విధంగా, 'బెస్ట్ కో-ఆర్డినేటర్' అవార్డును వాకర్స్ ప్రతినిధి నలుబోలు బలరామయ్యనాయుడు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు జి.నారాయణరెడ్డి, మాగంటి ప్రసాద్, పలగాటి శ్రీనివాసులురెడ్డి(ఆర్‌సి), ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, బెల్లం చెంచయ్య, కాగొల్లు శివయ్య, ఇనుకొండ సోను, ఎస్‌కె నజీర్‌అహ్మద్, బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కెవిఎస్‌వి ప్రసాద్, సితారి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# అద్భుతమైన శైలిలో శైలకుమార్ శైలీలు!

శైలకుమార్ గొప్ప నవలా రచయిత. కమర్షియల్ సీరియల్స్ రచయితగా, కథా రచయితగా ఎప్పుడూ బిజీగా ఉండడం పాఠకులకు తెలుసు. ఈమధ్యనే కాస్తంత స్లో అయినట్టు తోస్తుంది. ఉన్నట్టుండి శైలకుమార్ 'శైలీలు' అని ఒక కొత్త ప్రక్రియ ప్రారంభించి నాలుగు లైన్లలో అద్భుతమైన భావాల్ని పలికించడం విశేషం! ప్రపంచమంతా అటెన్షన్‌కు సమయం తగ్గిపోతున్న సంధి కాలంలో నాలుగులైన్లలో అపరిమిత భావాన్ని పలికించడం గొప్ప ప్రత్యేకత.

హైకూలు, నానీలు, రెక్కలు, జిప్సీలు, ట్రిమీలు ఇలా నాలుగైదు లైన్లలో గాఢమైన భావాన్ని పదునుగా అందించే ప్రక్రియలు వెల్లివిరిసాయి. ఇప్పుడు 'శైలీలు' మరింత పదునెక్కింది.

శైలకుమార్ శైలీల్లో మనిషిమీద, మతం పైన, వైద్య రంగంపైన విశిష్టంగా స్పందించారు. వ్యంగ్య వైచిత్రిని ప్రదర్శించారు. తాత్వికతనూ తనదైన శైలిలో ప్రతిష్ఠించిన ఘనత శైలకుమార్ 'శైలీ'లదే!

ఎంతిచ్చి కొనగలవు కాలాన్ని / ఏమిచ్చి నిలిపేవు ప్రాణాన్ని.. ఈ శైలీ చదివినపుడు ఒక్కసారిగా గుగ్గుర్పాటుకు లోనవుతాం. కాలాన్ని కొనగలిగే, అధిగమించగలిగే వ్యక్తులు, శక్తులు ఇప్పటికీ జనియించలేదు. అలాగే ప్రాణాన్ని నిలపగలిగే మందు కానీ, డాక్టర్లు గాని ఇప్పటికి పుట్టలేదనడం అక్షరాలా నిజం. ఆ నిజాన్ని కలిపి 'మాడు పగిలేట్టు' చెప్పిన ఘనత శైలకుమార్ శైలీది.

'రాజ్యాలేలినారు రాజులు, ఎవరికెవరు ఉంచినారు కులసతులకు గాజులు' అనేది మహత్తరమైన సినిమా పాట. దాన్ని మరొక శైలీలో ప్రతిభావంతంగా ఆవిష్కరించారు శైలకుమార్ కవి. వెళ్ళిపోయిన చాలు వెనుకకే రాదు / రాజరాజుల జాడ రవ్వంత లేదు అని చెప్పు తాత్వికతను జోడించారు. ఇదో కొత్త ప్రయోగంగా చెప్పవచ్చు.

మతం మీద కవికి స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. అందుకేనేమో అయిదారు 'శైలీ'ల్లో నిక్కచ్చి అభిప్రాయాల్ని చెప్పారు. ప్రపంచ వినాశనానికి అక్కర్లేదు అణ్వాయుధాలు / మతం చాలు మనిషికున్న ఆశ చాలు అని ఒక శైలీ సంధించి మరో శైలీలో ఇల్లు దాటి వీధిలోకి వచ్చిందా మతము / అవుతుందీ దేశం సర్వనాశనము అని చెప్పారు. మతాన్ని, మనిషికున్న ఆశను జోడించి విలక్షణంగా చెప్పడంలోని శ్లేషతో ఆయన సృష్టించిన శైలీ పాఠకుడ్ని కదిలిస్తుంది. మనిషి నైజం పైన శైలకుమార్‌కు ప్రత్యేక అనుభవం ఉన్నట్లు ఉంది. అందుకేనేమో మానవ నైజంపై విశ్లేషణ చేస్తూ నాలుగైదు శైలీల్ని సృష్టించారు. అబ్బ అన్పించారు. మనిషిని ఆందోళనలో పడేశారు. కరోనాలు ఎన్నయినా మనిషి బుద్ధి మారదు / అతని కున్న స్వార్థానికి సముద్రమే చాలదు అని. ఒకటైతే.. దయ్యాలు దేవుళ్ళు వద్దయ్యా నాకు / మనసున్న మనుషులను ఒకసారి చూపు అని ప్రశ్నించడం అందెశ్రీ రాసిన మాయమైపోతున్నాడమ్మో మనిషన్నవాడు పాటను తలపిస్తుంది. ఇంకో శైలీలో మరో మాటంటారు కవివర్యులు. 'కోట్లు కోట్లు నోట్లున్నా నిలువదు ప్రాణం / చేసినట్టి మంచేరా నిలుచు కొద్దికాలం'అని మనిషికి దారిదీపమవుతారు.

నేల నీరు నిప్పు గాలి అన్నిటినీ అమ్మాడు / ఆకాశంకేసి మనిషి ఆశగా చూస్తున్నాడు అంటూ మనిషిలోని అంతులేని ఆశను, సంపాదించడమే పరమావధిగా బ్రతుకుతున్న ఆశయాన్ని వ్యంగ్యంగా విమర్శిస్తారు కవి. అలాగే 'మనిషి కుటిల బుద్ధి చూసి దేవుడే భయపడ్డాడు / ఎంత వెదికినా అందుకే కనబడడు' అంటారు. ఇటు దేవుడు కనబడని వైచిత్రిని, అటు మనిషి కుటిల బుద్ధిని కలగలిపి కొరడా ఝళిపించిన గొప్పదనం శైలకుమార్‌ది.

దేవాలయాల కంటే ఆస్పత్రులు మేలనేది శైలకుమార్ అభిభాషణ అభిలషణీయం. 'ఆలయాలు కాదురా ఆస్పత్రులు కట్టండి / ఇలలో దేవుడు వైద్యుడే అతనికి మొక్కండి' అంటూ దేవుడంటే వేరెవరూ వెతలతీర్చువాడు / అంతకంటే గొప్ప కదా వైద్యుడు నేడు' అని వైద్యవృత్తిని ప్రశంసిస్తారు. కనబడని దేవుణ్ణి విమర్శిస్తారు. రాహుకాలం లాంటి మూఢ నమ్మకాల్ని విమర్శించిన కవి శైలకుమార్. 'సైనికులు వైద్యులు ఇద్దరే మనకు రక్షకులు / దేశ మొకరు దేహమొకరు కాపాడే వీరులు' అంటూ సాగిన శైలకుమార్ 'శైలీలు' అద్భుతంగా ఉన్నాయని చెప్పవచ్చు. ప్రతి ఒక్కరూ చదవాల్సిన అతిచిన్న గొప్ప పుస్తకం. శైలకుమార్ కవికి అభినందనలు.





రచయిత:
డా॥ శైలకుమార్
సెల్: 7306588999
వెల : అమూల్యం పేజీలు : 39
ప్రతులకు:
సుద్దాల ఫౌండేషన్, హైదరాబాదు.
శైలకుమార్, తిరుపతి.



**చిన్ని నారాయణరావు**
94402 02942

# గ'ఘన' విజయం!



## • బాహుబలీ.. భళా భళీ!..
## • ఎల్‌వీఎం3-ఎం6 సూపర్ సక్సెస్

***ఆకాశంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గగనంలో మరో ఘనవిజయం సాధించింది. ఎల్‌వీఎం రాకెట్ ప్రయోగం విజయవంతమైన కొద్దిరోజుల్లోనే మరో ఎల్‌వీఎం3-ఎం6 ప్రయోగాన్ని దిగ్విజయంగా నిర్వహించింది. ఇస్రో ఛైర్మెన్ వి.నారాయణన్ సారథ్యంలో శాస్త్రవేత్తలు ఈ అపూర్వ విజయం సాధించారు. భారత్ గడ్డమీద నుంచి అతిపెద్ద రాకెట్‌ని సైతం నింగిలోకి దిగ్విజయంగా పంపి తమ సత్తా చాటుకున్నారు.***

శ్రీహరికోటలోని సతీస్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి ఈ నెల 24వ తేదీ బుధవారం ఉదయం 8.55 గంటలకు అత్యంత శక్తిమంతమైన మన బాహుబలి రాకెట్ నీలాకాశంలోకి నిప్పులు చిమ్ముకుంటూ దూసుకుపోయింది. కేవలం 15 నిమిషాలా 33 సెకన్లలోనే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తూ అమెరికాకు చెందిన 6100కిలోల బరువైన అత్యంత అధునాతన సమాచార ఉపగ్రహం 'బ్లూబర్డ్ బ్లాక్-2'ని నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. ఇస్రో చరిత్రలోనే ఇది అత్యంత బరువైన ఉపగ్రహం కావడం, భారత గడ్డమీద నుంచి నింగికెగసిన అతిపెద్ద రాకెట్ ప్రయోగం కూడా ఇదే కావడం విశేషం. ఇప్పటికే 8 ప్రయోగాల్లో విజయం సాధించిన బాహుబలి రాకెట్, తాజాగా 9వసారి కూడా తిరుగులేని విజయం సాధించింది. వాణిజ్య అంతరిక్ష ప్రయోగాల్లోనూ భారత్ తన ప్రతిభని మరోసారి చాటుకొన్నట్లయింది.

### మొబైల్ ఫోన్లకి.. ఉపగ్రహం నుంచి కనెక్టివిటీ :

ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగ విజయం సామాన్యమైనది కాదు. ఎంతో అద్భుత మైనది.. చరిత్రాత్మకమైనది కూడా. ప్రపంచవ్యాప్తంగా అత్యధికశాతం ప్రజల చేతుల్లో ఉన్న మొబైల్‌ఫోన్లకి ఈ ఉపగ్రహ నెట్‌వర్క్ కనెక్టివిటీ ద్వారా అత్యంత మేలు కలుగుతుంది. హిమాలయాల్లోని మంచుశిఖరాల ప్రాంతాలు, దట్టమైన కీకారణ్యాలు, అడవుల్లో సైతం ఇకనుంచీ ఎలాంటి అంతరాయం లేకుండా స్మార్ట్‌ఫోన్ పలక బోతోందన్నమాట. 4జీ, 5జీ వాయిస్, వీడియోకాల్స్, మెసేజ్‌లు, ప్రసారాలు అన్నీ అందించాలనే లక్ష్యంతో శాస్త్రవేత్తలు కృషి చేస్తుండడం, సాధారణ మొబైల్‌ఫోన్‌లకి కూడా నేరుగా హైస్పీడ్ సెల్యులార్ బ్రాడ్‌బ్యాండ్ సేవలందించే సామర్థ్యం ఈ ఉప గ్రహానికి ఉండడం గొప్ప విశేషం.

# దిమ్మతిరిగే ఆఫర్లతో.. పిచ్చెక్కిస్తున్న సంగీత

***మీ ఫోన్ చోరీకి గురయిందా..? మీ ఫోన్ పోగొట్టుకున్నారా..? మీ ఫోన్ పగిలిపోయిందా..? మీ ఇంట్లో టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్, మిక్సీ, మైక్రోవేవ్ ఇలా వీటిల్లో ఏదైనా చెడిపోయిందా..? అయితే..***

***మీకెందుకు చింత - సంగీత ఉండగా మీ చెంత..!***

వినూత్నమైన, ఆకర్షణీయమైన ఆఫర్లతో సంగీత ఇప్పుడు గృహోపకరణాల రంగంలో సంచలనం సృష్టిస్తోంది. నూతన సంవత్సరం సందర్భంగా దిమ్మ తిరిగే సౌకర్యాలని వినియోగదారులకి కానుకగా అందిస్తోంది. సంగీతలో మొబైల్ కొన్న వారు ఏడాదిలోగా ఆ ఫోన్‌ని పోగొట్టు కున్నా, లేదా ఎక్కడైనా మర్చిపోయినా, ఎవ రైనా దొంగిలించినా కేవలం 50శాతం చెల్లింపుతో కొత్త ఫోన్ మీకు అందిస్తుంది. మీ ఫోన్ పగిలిపోయి వాడడానికి పనికి రాకుండా పోతే కేవలం 30 శాతం చెల్లింపుతోనే కొత్త ఫోన్‌ని మీ సొంతం చేస్తుంది. అంతే కాదండోయ్ మీరు సంగీతలో మొబైల్ కొన్న ఏడాదిలోపు మీ ఇంట్లో టీవీ, ఏసీ, రెఫ్రిజిటర్, వాషింగ్ మిషన్, మిక్సీ, మైక్రోవేవ్ ఇలా వీటిల్లో ఏది చెడిపోయినా, ఎన్నిసార్లు చెడిపోయినా సంగీత ఉచితంగా రిపేర్ చేసి ఇస్తుంది. ఈ సౌకర్యం కేవలం మీరు మొబైల్ కొన్న ఊరిలోనే కాదు సుమా...! మీరు భారత దేశంలో ఏ ప్రాంతంలో వున్నా మీకు తన సేవలు అందించడానికి సంగీత సిద్ధంగా ఉంటుంది. ఉదాహరణకి మీరు చెన్నైలోని సంగీత స్టోర్‌లో మొబైల్ కొనుక్కున్న ఏడాది లోగా ముంబైకి బదిలీపై వెళ్ళిపోయినా అక్కడ సైతం సంగీత మీ గృహోపకరణా లకు సర్వీస్ అందిస్తుంది. ఈ సౌలభ్యం తొలి ఏడాదిలో మీరు సూచించిన 5 గృహోపకరణాలకి మాత్రమే వర్తిస్తుంది. ఆ అయిదు గృహోపకారణాలపై ఏడాది లోపు ఎన్నిసార్లయినా ఈ అవకాశాన్ని మీరు వాడుకోవచ్చు.

### కళ్ళుతిరిగే కాంబో ఆఫర్లు!

వింటేనే కళ్ళు తిరిగేలా అద్భుతమైన కాంబో ఆఫర్లని కూడా సంగీత కొత్త ఏడాది కానుకగా అందించబోతోంది. 43 ఇంచ్‌ల టీవీ కొన్నవారికి ఒక వాషింగ్ మిషన్, లేదా మరో 32 ఇంచిల టీవీ, లేదా ఒక ఎయిర్‌కూలర్, అలాగే 32 ఇంచిల టీవీ కొన్నవారికి ఒక 1.5 టన్ను స్ప్లిట్ ఏసీ కాంబో ఆఫర్ ధరలో అందివ్వ నున్నారు.

### మీ కంటికి మా రక్షణ అంటున్న సంగీత...!

భారతదేశంలోని ప్రఖ్యాత కంటి వైద్యసంస్థ అగర్వాల్ కంటి ఆసుపత్రితో సంగీత స్నేహపూర్వక ఒప్పందం చేసు కుంది. సంగీతలో మొబైల్ లేదా ఏ ఇతర గృహోపకరణం కొన్నాసరే, వారికి తొలి ఏడాదిలో అగర్వాల్ కంటి వైద్య ఆసు పత్రిలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

### 30 నిముషాల్లో హోమ్ డెలివరీ..!

ట్రాఫిక్‌లో మీరు ఇబ్బంది పడకుండా, ఇంట్లో నుండి మీరు కదలకుండా, సంగీత స్టోర్‌కి వెళ్లకుండా కేవలం మీరు ఆర్డర్ చేసిన 30 నిముషాలలో మీరు కోరుకున్న మొబైల్ మీకు అందించే బాధ్యతని కూడా సంగీత తీసుకుంటోంది. sangeetha.comకి వెళ్ళి మీకు నచ్చిన ఫోన్ సెలెక్ట్ చేసి ఆర్డర్ పెడితే కేవలం 30 నిముషాల్లో అది మీ చేతిలో ఉండేలా సేవలందిస్తోంది సంగీత.

ఇంకెందుకు ఆలస్యం వెంటనే మీకు దగ్గరలో వున్న సంగీత స్టోర్‌కి వెళ్ళండి లేదా మీ ల్యాప్‌టాప్, కంప్యూటర్, ఫోన్‌లలో sangeetha.comకి లాగిన్ అయ్యి కొత్త ఫోన్ ఆర్డర్ పెట్టండి... సంగీత అందిస్తున్న పిచ్చెక్కించే ఆఫర్లని సద్వినియోగం చేసుకోండి..!






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com